www.toliadugudaily.com
www.epaper.toliadugudaily.com

# తొలిఅడుగు

తెలుగు దిన పత్రిక

కోల్ ఇండియాకు రూ.9,593 కోట్ల లాభాలు




8

హైదరాబాద్ | సంపుటి : 02 | సంచిక : 12 | శుక్రవారం | 09 - 05 - 2025 | ఎడిటర్ : పి. జయరాం | పేజీలు : 8 | వెల : 4

# పాక్‌కు చుక్కలు చూపిస్తున్న భారత ఆర్మీ

## లాహెూర్, కరాచీ సహా 12 నగరాల ఎయిర్ డిఫెన్స్ సిస్టమ్ నాశనం!



తొలిఅడుగు, న్యూఢిల్లీ : 'ఆపరేషన్ సిందూర్'కు కొనసాగింపుగా భారత త్రివిధ దళాలు చేస్తున్న ప్రతీకార దాడులతో పాకిస్థాన్‌కు చుక్కలు కనిపిస్తున్నాయి. భారత సైనిక స్థావరాలే లక్ష్యంగా డ్రోన్లు, క్షిపణులతో బుధవారం అర్ధరాత్రిపూట దొంగ దెబ్బ తీయాలనుకొన్న దాయాదికి 'సుదర్శన చక్ర'తో గట్టిగా బుద్ధి చెప్పిన భారత సైన్యం.. పాక్ భద్రతకు ఆయువు పైట్టెన లాహెూర్‌పై ప్రహార్‌ను ప్రకటించింది. గురువారం ఉదయం ముప్పేట దాడులతో లాహెూర్ గగనతల రక్షణ వ్యవస్థను తుత్తునియలు చేసింది. ఈ మేరకు గురువారం పీఐబీ, రక్షణ, విదేశాంగ శాఖ ధ్రువీకరించాయి.

భారత్ చేపట్టిన 'ఆపరేషన్ సిందూర్'తో చావుదెబ్బ తిన్న పాక్ తీవ్ర ప్రతీకారేచ్ఛతో రగిలిపోయింది. ఈ క్రమంలోనే ఉత్తర, పశ్చిమ భారత్‌లోని 15 నగరాల్లో ఉన్న సైనిక స్థావరాలను పేల్చేయాలని బుధవారం అర్ధరాత్రి కుటిల యత్నాలకు తెగబడింది. అయితే, ఇది గుర్తించిన భారత సైన్యం రష్యాకు చెందిన ఎస్-400 సిస్టమ్స్ అలియాస్ సుదర్శన చక్ర ఎయిర్ డిఫెన్స్ సిస్టమ్‌తో పాక్ డ్రోన్లు, క్షిపణులను కూల్చేసింది. అయితే, భవిష్యత్తులో కూడా పాక్ ఇలాంటి దాడులకు తెగబడొచ్చన్న కారణంతో పాక్ సైన్యానికి కీలకంగా ఉన్న లాహెూర్‌తో పాటు మరో 12 ప్రాంతాల్లోని ఎయిర్ డిఫెన్స్ సిస్టమ్‌లను ధ్వంసం చేయాలని భారత సైన్యం ఈ సందర్భంగా నిర్ణయించింది. ఇందులో భాగంగా గురువారం ఉదయం తొలుత లాహెూర్ అనంతరం మరో 12 ప్రాంతాల్లో భారత సైన్యం అత్యాధునిక హారోప్ డ్రోన్లు, శక్తిమంతమైన క్షిపణులతో నిరంతరాయ దాడులు జరిపింది.

**- ఫొటోలు రాగానే ఎటాక్**

హెచ్‌క్యూ-9, 16 ఎయిర్ డిఫెన్స్ సెక్యూరిటీ వ్యవస్థకు సంబంధించిన బ్యాటరీ వ్యవస్థ ఫొటోలు ఎప్పుడైతే చేతికి చిక్కాయో.. ఆ వెంటనే ఇజ్రాయెల్‌కు చెందిన ప్రత్యేకమైన హారోప్ డ్రోన్లు, శక్తిమంతమైన క్షిపణులతో భారత సేనలు దాడులను మొదలుపెట్టాయి. అలా సెకండ్ల వ్యవధిలో ఆ బ్యాటరీ సిస్టమ్‌ను ధ్వంసం చేసింది. దీంతో హెచ్‌క్యూ-9, 16 ఎయిర్ డిఫెన్స్ సెక్యూరిటీ వ్యవస్థకు అవసరమైన సిగ్నలింగ్ దాదాపుగా నిలిచిపోయింది. ఆ వెంటనే పెద్దయెత్తున దాడులను ఉధృతం చేసిన భారత సైన్యం అలా మొత్తంగా లాహెూర్ గగనతల రక్షణ వ్యవస్థను భస్మీపటలం చేసేసింది.




పాక్ మీడియా కంటెంట్‌పై

## భారత్ నిషేధం

### ఓటీటీల్లో పాక్ సిరీస్‌లు బంద్

తొలిఅడుగు, న్యూఢిల్లీ : దేశ భద్రత దృష్ట్యా భారత ప్రభుత్వం కీలక ఉత్తర్వులు జారీ చేసింది. పాకిస్థాన్‌లో రూపొందిన మీడియా ప్రసారాలపై భారత్‌లో నిషేధం విధిస్తూ కేంద్ర సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖ ఒక ప్రకటన విడుదల చేసింది. జాతీయ

2

లబోదిబోమంటూ

## పాక్ ప్రెస్ మీట్



తొలిఅడుగు, ఇంటర్నెట్ డెస్క్: ఆపరేషన్ సిందూర్ అప్‌డేట్స్: కరాచీ, లాహెూర్, సహా ఇతర ప్రధాన నగరాలపై దాడి చేయడానికి భారతదేశం డ్రోన్‌లను ఉపయోగించిందని పాకిస్తాన్ పేర్కొంది. పాకిస్తాన్, పాకిస్తాన్ ఆక్రమిత కశ్మీర్‌లోని తొమ్మిది ఉగ్రవాద శిబిరాలపై భారత సాయుధ దళాలు

2

## పాతబస్తీలో తీవ్ర ఉద్రిక్తత



తొలిఅడుగు, హైదరాబాద్ : తెలంగాణలో రేవంత్ సర్కార్ అధికారంలోకి వచ్చాక అక్రమ కట్టడాలపై ఉక్కుపాదం మోపింది. ఈ మేరకు హైడ్రా అనే ఒక వ్యవస్థను ఏర్పాటు చేసింది. నగరంలోని చెరువులను ఆక్రమించి కట్టిన కట్టడాలను, అక్రమ ఆస్తులను ధ్వంసం చేసి పేదవాడికి సరైన న్యాయం కల్పించేలానేది దీని ముఖ్య ఉద్దేశ్యం. ఈ క్రమంలో చెరువులను ఆక్రమించి నిర్మించిన ఎంతో మంది బడా బాబులకు చెందిన బిల్డింగ్‌లను హైడ్రా నేలమట్టం చేసింది. హైడ్రా ఆధ్వర్యంలో జరుగుతున్న ఈ చర్యలపై కొందరు ప్రశంసలు కురిపిస్తున్నా.. మరోవైపు విమర్శలు కూడా

2

భారత క్షిపణి దెబ్బకు

## కుప్పకూలిన పాక్ యుద్ధ విమానం

- పాకిస్థాన్ వాయుసేనకు చెందిన ఎఫ్-16 యుద్ధ విమానం కూల్చివేత
- భారత ఉపరితలం నుంచి గగనతలంలోకి ప్రయోగించే క్షిపణి వ్యవస్థతో దాడి



తొలిఅడుగు, న్యూఢిల్లీ : భారత్, పాకిస్థాన్ మధ్య ఉద్రిక్తతలు తీవ్ర స్థాయికి చేరాయి. పాకిస్థాన్ వాయు సేనకు (పీఏఎఫ్) చెందిన అత్యాధునిక ఎఫ్-16 సుపర్ సోనిక్ యుద్ధ విమానాన్ని భారత ఉపరితలం నుంచి గగనతలంలోకి ప్రయోగించే క్షిపణి రక్షణ వ్యవస్థ సాయంతో కూల్చివేసినట్లు ఎన్డీటీవీ వర్గాలు వెల్లడించాయి. పాకిస్థాన్‌లోని పంజాబ్ ప్రావిన్స్‌లో ఉన్న కీలకమైన, అత్యంత పటిష్ఠమైన భద్రత కలిగిన సర్గోధా వైమానిక స్థావరం నుంచి ఈ ఎఫ్-16 విమానం

2



ఆపరేషన్ సిందూర్‌పై స్పందించిన

## పహల్గాం మృతుడి భార్య

తొలిఅడుగు, న్యూఢిల్లీ : పహల్గాంలో ఉగ్రదాడి నేపథ్యంలో పాకిస్థాన్‌తోపాటు పాక్ ఆక్రమిత కాశ్మీర్‌పై ఆపరేషన్ సిందూర్ పేరుతో భారత్ సైన్యం చర్యలు చేపట్టింది. ఈ చర్యలపై పహల్గాం దాడిలో మరణించిన మధుసూదన్ రావు భార్య కామాక్షి ప్రసన్న గురువారం కేరళలో స్పందించారు.

2

## న్యూఢిల్లీలోని కేంద్ర మంత్రి కార్యాలయానికి బెదిరింపులు



2

తొలిఅడుగు, న్యూఢిల్లీ : తాను చెప్పిన పని చేయాలని.. లేకుంటే మీ సంగతి చూస్తాంటూ ఓ అజాత వ్యక్తి న్యూఢిల్లీలోని కేంద్ర హెూం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కార్యాలయానికి గురువారం ఫోన్ చేసి బెదిరింపులకు పాల్పడ్డాడు. దీంతో కేంద్ర మంత్రి బండి సంజయ్ కార్యాలయం వెంటనే స్పందించింది. ఈ బెదిరింపులపై ఆయన కార్యాలయం.. హైదరాబాద్‌లోని రాచకొండ కమిషనర్ సుధీర్ బాబుకు ఫోన్ చేసి వివరించింది.

# పాకిస్థాన్‌కు రేవంత్ రెడ్డి వార్నింగ్

### - దేశ సార్వభౌమత్వాన్ని దెబ్బతీయాలని చూస్తే సహించేది లేదు : సీఎం రేవంత్ రెడ్డి




తొలిఅడుగు, హైదరాబాద్ : ఉగ్రవాదాన్ని ప్రోత్సహించి భారత దేశ సార్వభౌమత్వాన్ని దెబ్బతీయాలని చూస్తే సహించేది లేదని దయాది దేశం పాకిస్థాన్‌కు తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. ఆపరేషన్ సిందూర్ నేపథ్యంలో భారత సైన్యానికి సంఘీభావంగా గురువారం హైదరాబాద్‌లో ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో సీఎం రేవంత్ రెడ్డితోపాటు పలువురు మంత్రులు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. దేశ రక్షణలో అందరం ఒక్కటేనని చాటుతూ తెలంగాణ గడ్డ నుంచి భారత జవాన్లకు స్ఫూర్తి నిచ్చేందుకే ఈ సంఘీభావ ర్యాలీ చేపట్టినట్లు ఆయన వివరించారు. భారతదేశ సార్వభౌమత్వాన్ని ఎవరైనా దెబ్బతీయాలని చూస్తే వారికి నూకలు చెల్లినట్లేనని.. ఇది మా హెచ్చరిక అంటూ సీఎం రేవంత్ రెడ్డి వార్నింగ్ ఇచ్చారు. దేశ రక్షణ విషయంలో రాజకీయాలకు అతీతంగా ఒక్కటవుతామని ఆయన తెలిపారు. మేం శాంతి కాముకులమని ఆయన పేర్కొన్నారు. అది మా

2

ఉద్రిక్తతలు.. నష్టాల్లో

## భారత స్టాక్ మార్కెట్



### భారత్-పాక్ ఉద్రిక్తతలతో స్టాక్ మార్కెట్లపై తీవ్ర ప్రభావం

తొలిఅడుగు, న్యూఢిల్లీ : భారత్, పాకిస్థాన్‌ల మధ్య నెలకొన్న తీవ్ర ఉద్రిక్తతలు దేశీయ స్టాక్

2

### ఆపరేషన్ సిందూర్‌పై స్పందించిన
# పహల్గాం మృతుడి భార్య

మొదటిపేజీ తరువాయి దాయాది దేశం పాకిస్థాన్‌పై కేంద్రం ఈ ఆపరేషన్ సిందూర్‌ను చేపట్టడాన్ని ఆమె స్వాగతించారు. ఈ చర్య బాధిత కుటుంబాలకు కొంత సాంత్వన కలిగిస్తుందన్నారు. అయితే పహల్గాం ఉగ్ర దాడిలో తాము భర్తలను కోల్పోయమని ప్రజలంతా భావిస్తున్నారని.. కానీ తాము జీవితాలనే కోల్పోయామని ఈ సందర్భంగా ఆమె కన్నీటి పర్యంతమయ్యారు. పహల్గాం దాడిలో 26 మంది మరణించడంతో.. దేశంలో ఏ ఒక్కరు సంతోషంగా లేరని ఆమె పేర్కొన్నారు.

ఏప్రిల్ 22వ తేదీ జమ్మూ కాశ్మీర్ అనంతనాగ్ జిల్లాలోని పహల్గాంలో పర్యాటకులే లక్ష్యంగా ఉగ్రవాదులు కాల్పులు జరిపారు. ఈ దాడిలో 26 మంది మరణించారు. ఈ దాడిపై జాతీయ దర్యాప్తు సంస్థ విచారణ చేపట్టింది. ఈ విచారణలో భాగంగా బాధిత కుటుంబాలను కలిసి.. పహల్గాం ఉగ్రదాడి ఎలా జరిగింది, ఉగ్రవాదులు కాల్పులు జరిపే ముందు ఏం చేశారు.. ఎలా వ్యవహరించారు.. ఏమని ప్రశ్నించారంటూ ఎన్ఐఏ బృందాలు వారికి ప్రశ్నలు సంధించారు. అలా దాదాపు అన్ని బాధిత కుటుంబాలను ఈ బృందాలు ప్రశ్నించాయి. మరోవైపు ఈ ఉగ్రదాడితో ఉగ్రవాదాన్ని పెంచి పోషిస్తున్న పాకిస్థాన్‌కి సంబంధాలున్నాయనే సాక్ష్యాలను భారత్ సంపాదించింది. దీంతో పాకిస్థాన్‌కు వ్యతిరేకంగా భారత్ పలు కీలక నిర్ణయాలు తీసుకుంది. ఆ క్రమంలో బుధవారం తెల్లవారుజామున పాకిస్థాన్‌తోపాటు పాక్ ఆక్రమిత కాశ్మీర్‌లోని ఉగ్రవాద స్థావరాలపై భీకర దాడులను భారత సైన్యం చేపట్టింది. ఈ చర్యకు ఆపరేషన్ సిందూర్ అనే పేరును కేంద్రం పెట్టింది. ఈ ఆపరేషన్ సిందూర్‌పై కామాక్షి ప్రసన్నపై విధంగా స్పందించారు. ఇంకోవైపు ఈ ఆపరేషన్ సిందూర్‌లో కీలక పాత్ర పోషించిన కల్నల్ సోఫియా ఖురేషికి అన్ని వర్గాల నుంచి ప్రశంసలు అందుతోన్నాయి. ఆమె కుటుంబ సభ్యులు సైతం సోఫియా పాత్రను అభినందిస్తున్నారు.

# లబోదిబోమంటూ పాక్ ప్రెస్ మీట్

మొదటిపేజీ తరువాయి క్షిపణి దాడులు చేసిన ఒక రోజు తర్వాత, లాహోర్, కరాచీలపై భారతదేశం డ్రోన్ దాడులు ప్రారంభించిందని పాకిస్తాన్ సైన్యం పేర్కొంది. ఇలా ఉండగా, భారత్ ఆపరేషన్ సిందూర్ కొనసాగిస్తోంది. పాక్ కు చుక్కలు చూపిస్తోంది. పాక్ దాడులను తిప్పికొడుతూ భారత్ భారీగా ఎదురుదాడులు చేస్తోంది. తాజాగా పాక్ ఆర్మీ హెడ్ క్వార్టర్‌పై భారత్ డ్రోన్ దాడి చేసింది. పాక్ ఎయిర్ డిఫెన్స్ సిస్టమ్‌ను ధ్వంసం చేసింది. అటు, రావల్పిండి హెడ్ క్వార్టర్ పైనా భారత్ డ్రోన్ దాడి చేసింది. దీంతో పాకిస్థాన్ మీడియా ముందుకొచ్చి ప్రపంచ దేశాలతో లబోదిబోమంటూ మొరపెట్టుకుంటోంది. లాహోర్, కరాచీ ఇంకా పాకిస్థాన్ లోని ఇతర ప్రదేశాలలో భారత్ వరుస డ్రోన్ దాడులు నిర్వహించిందని పాకిస్తాన్ సైన్యం పేర్కొంది. మరోవైపు, కరాచీ విమానాశ్రయాన్ని సాయంత్రం 6 గంటల వరకు మూసివేసినట్లు పాకిస్థాన్ ప్రకటించగా, ఇస్లామాబాద్, లాహోర్‌లలో "సాంకేతిక కారణాల వల్ల" కొంత సమయం మూసివేసినట్లు పాకిస్తాన్ పౌర విమానయాన సంస్థ తెలిపింది.

# పాక్ మీడియా కంటెంట్‌పై భారత్ నిషేధం

మొదటిపేజీ తరువాయి భద్రతకు ప్రాధాన్యతనిస్తూ ఈ నిర్ణయం తీసుకున్నట్లు ప్రభుత్వం స్పష్టం చేసింది. ఓటీటీ వేదికలతో పాటు, ఇతర డిజిటల్ మీడియా మాధ్యమాల్లో ప్రసారమయ్యే పాకిస్థానీ వెబ్‌సిరీస్‌లు, సినిమా పాటలు, పాడ్‌కాస్ట్‌ల వంటి కంటెంట్‌ను తక్షణమే నిలిపివేయాలని కేంద్రం తన ఆదేశాల్లో పేర్కొంది. ఈ నిషేధాజ్ఞలు వెంటనే అమల్లోకి వస్తాయని, సంబంధిత వేదికలు దీన్ని కచ్చితంగా పాటించాలని సూచించింది. ఇకపై భారతీయ ప్రేక్షకులు పాకిస్థానీ కంటెంట్‌ను అధికారికంగా వీక్షించే వీలుండదు.

# న్యూఢిల్లీలోని కేంద్ర మంత్రి కార్యాలయానికి బెదిరింపులు



దాంతో సీపీ సుధీర్ బాబు ఆదేశాల మేరకు.. పోలీసులు రంగంలోకి దిగారు. ఆ క్రమంలో ఈ బెదిరింపులకు పాల్పడిన వ్యక్తి ఎక్కడి నుంచి ఫోన్ చేశాడంటూ.. సెల్ టవర్ల ఆధారంగా విచారణ చేపట్టారు. దీంతో ఆదిభట్ల పరిధిలోని నాదర్ గుల్ సమీపంలో జయసూర్యనగర్‌కు చెందిన కేపీ రావు.. ఈ ఫోన్ చేసినట్లు పోలీసులు గుర్తించారు. దీంతో కేపీరావును పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అనంతరం అతడిని సమీపంలోని పోలీస్ స్టేషన్‌కు పోలీసులు తరలించారు. ఆ తర్వాత అతడిని పోలీసులు విచారిస్తున్నారు. అయితే గతంలో సైతం కేపీ రావు.. లంచాల కోసం పలు ప్రభుత్వ కార్యాలయాలతోపాటు పలువురు రాజకీయ నాయకులకు ఈ తరహా ఫోన్లు చేసి బెదిరింపులకు పాల్పడే వారని పోలీసుల విచారణలో గుర్తించారు.

# ఉద్రిక్తతలు.. నష్టాల్లో భారత స్టాక్ మార్కెట్

మొదటిపేజీ తరువాయి మార్కెట్లను కుదిపేశాయి. 'ఆపరేషన్ సిందూర్' పేరిట భారత సైన్యం చేపట్టిన చర్య అనంతరం, పాకిస్థాన్ వైపు నుంచి సరిహద్దు రాష్ట్రాలపై డ్రోన్లు, క్షిపణులతో దాడులకు ప్రయత్నాలు జరిగాయి. దీనికి ప్రతిగా భారత దళాలు పాకిస్థాన్‌లో మోహరించిన గగనతల రక్షణ వ్యవస్థలను లక్ష్యంగా చేసుకున్నాయి. ఈ దాడుల్లో లాహోర్‌లోని పాకిస్థాన్ ఎయిర్ డిఫెన్స్ వ్యవస్థ ధ్వంసమైందని భారత రక్షణ శాఖ వర్గాలు వెల్లడించాయి. ఈ పరిణామాల నేపథ్యంలో, ఉదయం లాభాలతో ప్రారంభమైనప్పటికీ, చివరి గంటలో అమ్మకాల ఒత్తిడి తీవ్రరూపం దాల్చడంతో సూచీలు భారీ నష్టాలను చవిచూశాయి. ఫలితంగా సెన్సెక్స్ 400 పాయింట్లకు పైగా పతనమవ్వగా, నిఫ్టీ కీలకమైన 24,300 స్థాయికి దిగువన ముగిసింది. అంతర్జాతీయ మార్కెట్ల నుంచి మిశ్రమ సంకేతాలున్నప్పటికీ, దేశీయ సూచీలు ఉదయం ఉత్సాహంగానే మొదలయ్యాయి. బీఎస్ఈ సెన్సెక్స్ క్రితం ముగింపు 80,746.78 పాయింట్లతో పోలిస్తే, 80,912.34 పాయింట్ల వద్ద లాభాల్లో ప్రారంభమైంది. రోజంతా స్వల్ప శ్రేణిలో లాభనష్టాల మధ్య కదలాడిన సూచీ, సరిహద్దుల్లో ఉద్రిక్తతలు పెరిగాయన్న వార్తలతో చివరి గంటలో ఒక్కసారిగా అమ్మకాల ఒత్తిడికి లోనైంది. చివరకు సెన్సెక్స్ 411.97 పాయింట్ల నష్టంతో 80,334.81 వద్ద స్థిరపడింది. అదేవిధంగా, నిఫ్టీ కూడా 140 పాయింట్లు కోల్పోయి 24,273.80 వద్ద ముగిసింది. డాలర్‌తో రూపాయి మారకం విలువ 85.72 వద్ద కొనసాగుతోంది. మిడ్‌క్యాప్, స్మాల్‌క్యాప్ సూచీలు కూడా నష్టాలను మూటగట్టుకున్నాయి. నిఫ్టీ మిడ్‌క్యాప్ సూచీ 1.95 శాతం, నిఫ్టీ స్మాల్‌క్యాప్ సూచీ 1.43 శాతం మేర క్షీణించాయి. సెన్సెక్స్‌లోని 30 కంపెనీల్లో ఎటర్నల్, మహీంద్రా అండ్ మహీంద్రా, మారుతీ సుజుకీ, బజాజ్ ఫైనాన్స్, టాటా స్టీల్ షేర్లు ప్రధానంగా నష్టపోయిన వాటిలో ఉన్నాయి. హెచ్‌సీఎల్ టెక్నాలజీస్, కోటక్ మహీంద్రా బ్యాంక్, యాక్సిస్ బ్యాంక్, టైటాన్, టాటా మోటార్స్ షేర్లు లాభాలతో ముగిశాయి.

– పాక్ స్టాక్ ఎక్స్ఛేంజ్‌లో ప్రకంపనలు

భారత సైనిక చర్యల దెబ్బకు పాకిస్థాన్ స్టాక్ మార్కెట్ కుదేలైంది. 'ఆపరేషన్ సిందూర్' ప్రభావంతో నిన్న భారీగా నష్టపోయిన పాక్ స్టాక్ ఎక్స్ఛేంజ్ (పీఎస్ఎక్స్), నేడు ట్రేడింగ్ సమయంలో అరగంట పాటు నిలిచిపోయింది. కరాచీ సమీపంలో భారత సైనిక దళాలు విరుచుకుపడ్డాయన్న వార్తలు వ్యాపించడంతో మదుపరులు భయాందోళనలకు గురై, అమ్మకాలకు తెగబడ్డారు. ట్రేడింగ్ నిలిపివేతకు ముందు కేఎస్ఈ 100 సూచీ ఏకంగా 6,948 పాయింట్లు (6.32 శాతం) పతనమై 103,060 వద్ద నిలిచింది. కొంత సమయం తర్వాత ట్రేడింగ్ పునఃప్రారంభమైనప్పటికీ, నష్టాలు కొనసాగుతూనే ఉన్నాయి.

# భారత క్షిపణి దెబ్బకు కుప్పకూలిన పాక్ యుద్ధ విమానం

మొదటిపేజీ తరువాయి గాల్లోకి లేచిన కొద్దిసేపటికే, స్థావరం సమీపంలోనే భారత క్షిపణి దానిని కూల్చివేసినట్లు సమాచారం. 1971 యుద్ధం తర్వాత ఇరు దేశాల మధ్య ఇంత పెద్ద ఎత్తున ఉద్రిక్తతలు తలెత్తడం ఇదే తొలిసారని రక్షణ వర్గాలు పేర్కొంటున్నాయి. ఈ పరిణామాల నేపథ్యంలో అంతర్జాతీయ సరిహద్దు వెంబడి రాజస్థాన్‌లోని పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేసి, బ్లాక్‌అవుట్ విధించారు. జమ్మూను డ్రోన్లు, క్షిపణులతో లక్ష్యంగా చేసుకోవాలన్న పాకిస్థాన్ కుట్ర విఫలమైన నేపథ్యంలో ఈ ప్రధాన ఘటన జరిగింది. జమ్మూలోని ఆర్ఎస్ పురా, అర్నియా, సాంబా, హీరానగర్ సెక్టార్లలో పాకిస్థాన్ దళాలు భారీగా ఫిరంగి దాడులకు తెగబడ్డాయి. అలాగే, అంతర్జాతీయ సరిహద్దుకు సమీపంలో ఉన్న పంజాబ్‌లోని పఠాన్‌కోట్‌పైనా పాక్ నుంచి తీవ్రస్థాయిలో కాల్పులు జరిగాయి. పఠాన్‌కోట్ వ్యూహాత్మకంగా భారత్‌కు కీలకమైన ప్రాంతం కావడం గమనార్హం. సరిహద్దు వెంబడి పాకిస్థాన్ డ్రోన్ల చొరబాట్లను భారత వాయు రక్షణ వ్యవస్థలు విజయవంతంగా అడ్డుకున్నాయి.

# పాతబస్తీలో తీవ్ర ఉద్రిక్తత

మొదటిపేజీ తరువాయి వస్తున్నాయి. ఇదే క్రమంలో తాజాగా చాంద్రాయణగుట్టలో హైడ్రా కూల్చివేతల వల్ల పెద్దఎత్తున ఆందోళనలు జరిగాయి. హైదరాబాద్ నగరం పాతబస్తీ చాంద్రాయణగుట్టలోని అక్బర్‌నగర్ ప్రాంతంలో నగర పాలక అధికారులు కూల్చివేత చర్యలు చేపట్టారు. ఇది కాస్తా స్థానికంగా ఉద్రిక్తతకు దారితీసింది. భారీ పోలీసు బందోబస్తు నడుమ, అనధికారంగా నిర్మించబడిన షాపులను హైడ్రా నేతృత్వంలో అధికారులు కూల్చివేశారు. ఈ క్రమంలో హైడ్రా చర్యలను ప్రతిఘటిస్తూ స్థానికులు జేసీబీకి ఎదురు నిలిచారు. తమ స్థలాల్లో నిర్మించుకున్న కట్టడాలను కూల్చవద్దంటూ నిరసన వ్యక్తం చేశారు. ఇది కాస్తా ముదిరి పోలీసులు, స్థానికులకు మధ్య తోపులాటకు దారి తీసింది. నిబంధనల ప్రకారం అవన్నీ అక్రమ ఆస్తులనీ, ప్రభుత్వ ఆదేశాల మేరకు కూల్చివేతలు తప్పవని పోలీసులు వివరిస్తున్నా పట్టించుకోలేదు. ఇప్పుడు హైడ్రా పేరుతో తమ ఆస్తులను ధ్వంసం చేస్తే, ప్రభుత్వమే తమకు ఏదైనా మార్గం చూపించాలని నిరసన వ్యక్తం చేశారు. ఇదిలా ఉండగా.. హైడ్రా కూల్చివేతల చర్యలకు వ్యతిరేకంగా పార్టీకి చెందిన కార్పొరేటర్లు.. హైడ్రా, మున్సిపల్ అధికారులపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. స్థానిక పాతబస్తీ ప్రజలకు ఇలాంటి ప్రభుత్వ చర్యలపై ముందస్తు సమాచారం ఇవ్వకుండా అకస్మాత్తుగా కూల్చివేతలు చేపట్టడం అన్యాయమన్నారు. దీనిపై ప్రభుత్వం దృష్టి సారించి ఇకనైనా హైడ్రా చర్యలపై ఒక నియంత్రణ తీసుకురావాలని కోరుతున్నారు.

# పాకిస్థాన్‌కు రేవంత్ రెడ్డి వార్నింగ్

మొదటిపేజీ తరువాయి చేతగానితనం అనుకుని మా ఆడబిడ్డల నుదిటి సిందూరం తుడిచేయాలనుకుంటే.. వారికి ఆపరేషన్ సిందూర్ ద్వారా సమాధానం చెబుతామన్నారు. ఉగ్రవాదాన్ని తుదముట్టించేందుకు భారత సైన్యానికి మద్దతుగా నిలుస్తామని సీఎం రేవంత్ రెడ్డి చెప్పారు. అంతకుముందు గురువారం సాయంత్రం ఈ సంఘీభావ ర్యాలీ సెక్రటేరియట్ నుంచి నెక్లెస్ రోడ్డులోని ఇందిరాగాంధీ విగ్రహం వరకు సాగింది. అనంతరం పహల్గాం మృతులకు సీఎం రేవంత్ రెడ్డితోపాటు ఆయన కేబినెట్‌లోని పలువురు మంత్రులు ఘనంగా నివాళులర్పించారు. వారి చిత్రపటాలకు పుష్పాంజలి ఘటించి.. వారి మృతికి సంతాప సూచకంగా రెండు నిమిషాలపాటు మౌనం పాటించారు. పహల్గాం ఉగ్రదాడి నేపథ్యంలో భారత్ ప్రతీకార చర్యగా బుధవారం తెల్లవారుజామున ఆపరేషన్ సిందూర్ చేపట్టింది. అందులోభాగంగా పాకిస్థాన్‌తోపాటు పాక్ ఆక్రమిత కాశ్మీర్‌లోని ఉగ్రవాద మూకల స్థావరాలను నేలమట్టం చేసింది. కేంద్ర ప్రభుత్వ చర్య పట్ల సర్వత్ర హర్షం వ్యక్తమవుతోంది.




# జమ్మూపై పాక్ క్షిపణి, డ్రోన్ల దాడి

తొలిఅడుగు, న్యూఢిల్లీ : జమ్మూలో భారీ పేలుళ్లుబీ క్షిపణులు, డ్రోన్లతో దాడి జరిగినట్లు అనుమానంబీ విద్యుత్ సరఫరా నిలిపివేత సాంబా, పూంచ్ తదితర సరిహద్దు సెక్టార్లలో పాక్ నుంచి తీవ్రస్థాయిలో షెల్లింగ్ భారత వాయు రక్షణ వ్యవస్థలు పాక్ క్షిపణులు, డ్రోన్లను అడ్డగించినట్లు స్థానికుల కథనం పహల్గామ్ ఉగ్రదాడికి ప్రతిగా భారత్ చేపట్టిన 'ఆపరేషన్ సిందూర్' అనంతరం పెరిగిన ఉద్రిక్తతలు భారతదేశంలోని పదిహేను నగరాలపై ఉగ్రవాద దాడులకు పాకిస్థాన్ చేసిన ప్రయత్నం విఫలమైన కొద్ది గంటల వ్యవధిలోనే, జమ్మూ కశ్మీర్‌లోని పలు ప్రాంతాలపై పాకిస్థాన్ దాడులకు తెగబడింది. ఈ పరిణామంతో సరిహద్దుల్లో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. ముఖ్యంగా జమ్మూ నగరం క్షిపణులు, డ్రోన్ల దాడితో దద్దరిల్లింది. శుక్రవారం రాత్రి 9 గంటల ప్రాంతంలో జమ్మూ నగరంలో భారీ పేలుళ్ల శబ్దాలు వినిపించాయి. అనంతరం అత్యవసర సైరన్లు మోగడంతో పాటు నగరం మొత్తం అంధకారంలోకి వెళ్లిపోయింది. పాకిస్థాన్ ప్రయోగించిన క్షిపణులు, డ్రోన్లను భారత వాయు రక్షణ వ్యవస్థలు ఆకాశంలోనే అడ్డగించినట్లు, ఆ సమయంలో కాంతి రేఖలు కనిపించాయని స్థానికులు సెల్‌ఫోన్లలో చిత్రీకరించిన వీడియోల ద్వారా తెలుస్తోంది. జమ్మూతో పాటు 300 కిలోమీటర్ల దూరంలోని కుప్వారా, పంజాబ్‌లోని పఠాన్‌కోట్, గురుదాస్‌పూర్ పట్టణాలలో కూడా విద్యుత్ సరఫరా నిలిపివేసి, బ్లాక్‌అవుట్ ప్రకటించారు. బారాముల్లాలోనూ పూర్తిస్థాయి బ్లాక్‌అవుట్ అమలులో ఉంది. అంతర్జాతీయ సరిహద్దు వెంబడి సాంబా, అఖ్నూర్, రాజౌరి, రియాసి సెక్టార్లలో పాకిస్థాన్ సైన్యం ఇప్పటికే తీవ్రస్థాయిలో షెల్లింగ్‌కు పాల్పడుతోంది. జమ్మూ విమానాశ్రయంపై కూడా పలు దాడులు జరిగినట్లు విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. అంతర్జాతీయ సరిహద్దు వెంబడి పెద్ద ఎత్తున డ్రోన్ దాడులు జరిగినట్లు సమాచారం."జమ్మూలో పూర్తి బ్లాక్‌అవుట్. భారీ పేలుళ్లు, బాంబు దాడులు, షెల్లింగ్, లేదా క్షిపణి దాడులని అనుమానిస్తున్నాం.

ఆందోళన చెందవద్దు... మాతా వైష్ణో దేవి మనతో ఉంది, అలాగే మన వీర భారత సాయుధ దళాలు కూడా ఉన్నాయి" అని జమ్మూ కశ్మీర్ మాజీ డీజీపీ శేష్ పాల్ వైద్ పేర్కొన్నారు. ప్రస్తుత పరిస్థితుల దృష్ట్యా సరిహద్దు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచిస్తున్నారు.

# దేశ ఐక్యతకు ఆపరేషన్ సిందూర్..నిదర్శనం

- రవీందర్ యాదవ్
- ఉగ్రస్థావరాలపై భారత్ దాడి శుభ పరిణామం
- కేంద్రం చర్యలకు మద్దతు తెలిపిన రవీందర్ యాదవ్
-పెహల్‌గామ్ ఘటన బాధాకరమైనది

శేరిలింగంపల్లి / తొలిఅడుగు : ఆపరేషన్ సిందూర్ విజయవంతమైనందుకు ఆనందంగా ఉందని భారాస సీనియర్ నేత రవీందర్ యాదవ్ అన్నారు. దశాబ్దాలుగా సహనం.. సహనం.. మితిమీరిన సహనంతో చేతులు కట్టేసిన సమస్త భారత్‌కు ఆపరేషన్ సింధూర్‌తో తిరిగి భారత సమాజంలో వీరత్వాన్ని నింపిన త్రివిధ దళాధిపతులకు, వారికి వెన్నంటి నిలబడ్డ ప్రధానమంత్రి నరేంద్రమోదీకి కృతజ్ఞతలు తెలిపారు. ఉగ్రవాదాన్ని నిర్మూలించడంలో కేంద్రం ఏ నిర్ణయం తీసుకున్నా వెన్నంటే మేము ఉంటామని రవీందర్ యాదవ్ స్పష్టం చేశారు. పెహల్గామ్ లో పాక్ చేసిన ఉగ్రదాడికి భారత్ ఆపరేషన్ సిందూర్ తో గట్టి జవాబును ఇచ్చిందన్నారు. మరిన్ని ఉగ్రస్థావరాలను సైతం పాక్ లో లేకుండా భారత్ చేయాలని కేంద్రాన్ని కోరారు. పాకిస్థాన్ ఉగ్రవాదులను పెంచి పోషిస్తుందని ఆరోపించారు. పుల్వామా, ఉరి ఘటనలు మరిచిపోలేనివన్నారు. పర్యాటకులను టార్గెట్ చేసి పెహల్గామ్ లో ఉగ్రవాదులు దాడులు చేయడం జరిగిందన్నారు. పాక్ లోని ఉగ్రవాదులను ఏరిపారేయాలని ఈ సందర్భంగా రవీందర్ యాదవ్ కేంద్రాన్ని కోరారు. ఆపరేషన్ సిందూర్ తో ఆగిపోవద్దన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కట్టుదిట్టమైన భద్రతను కొనసాగించాల్సిన బాధ్యత ఉందన్నారు. దేశంలోనూ ఉగ్రదాడులు జరిగే ప్రమాదం ఉన్నందున ప్రజలు అంతా అప్రమత్తంగా ఉండాలని సూచించారు.




# మంచినీళ్లు వస్తలేవు

తొలిఅడుగు : శామీర్ పేట్,: నెల రోజుల నుంచి తాగునీళ్లు రావడం లేదని ఇందిరమ్మ కాలనీ వాసులు గురువారం ఖాళీ బిందెలతో రోడ్డెక్కారు. నల్లా నీళ్లు రాకపోవడంతో ట్యాంకర్ల నీళ్లు కొనలేక పోతున్నామని ఆగ్రహం వ్యక్తం చేశారు. మేడ్చల్ జిల్లా శామీర్ పేట్ మండలం లాల్ గడి మలక్ పేట్ గ్రామంలో గ్రామ పంచాయతీ ఎదుట నిరసన చేపట్టారు. ప్రభుత్వం, అధికారుల పాలనపై తీవ్రస్థాయిలో మండిపడ్డారు. లాల్‌గడి మలక్ పేట్ గ్రామంలోనే నీటి సమస్య ఎందుకు వస్తుందని పంచాయతీ సెక్రటరీ శ్రీనివాస్ రెడ్డిని గ్రామస్తులు నిలదీశారు. మిషన్ భగీరథ అధికారుల నిర్లక్ష్యం వల్లే తమ గ్రామంలో నీటి సమస్య తలెత్తుతుందని కాలనీ వాసులు తెలిపారు. నెల రోజులుగా ఇందిరమ్మ ఇళ్ల కాలనీకి నీటి సమస్య ఉందన్నారు. సమస్యను వివరిస్తే కాలనీ మొత్తానికి ట్యాంకర్‌ను పంపి చేతులు దులుపు కుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పన్నులు, ట్యాక్స్‌లు కట్టకపోతే నల్లా కనెక్షన్ లు కట్ చేస్తామని అధికారులు హెచ్చరిస్తారని, నీరు సరిగా రావడం లేదని ఫిర్యాదు చేస్తే పట్టించుకునే వారే లేరని వాపోయారు. కార్యదర్శి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ గ్రామానికి రావాల్సిన నీళ్లు సరిగా రావడం లేదని, వచ్చిన నీళ్లనే సర్దుబాటు చేస్తున్నామని చెప్పడంతో నిరసన విరమించారు.

# 9 న కామ్రేడ్ భీమిరెడ్డి నరసింహారెడ్డి గారి 17వ వర్ధంతి సభ

- తెలంగాణ క్యాస్ట్రో గాలి లిపేరు గాంచిన రైతాంగ పోరాట యోదుడు
- తుంగతుర్తిలో స్మారక స్తూపావిష్కరణను జయప్రదం చేయండి.



మియాపూర్ / తొలిఅడుగు: మే 9 వ తేదీన ఉమ్మడి నల్గొండ జిల్లా తుంగతుర్తి నియోజకవర్గ కేంద్రంలో ఉదయం 12 గం లకు తెలంగాణ క్యాస్ట్రో , వీర తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం నిర్మాణం లో ప్రముఖ ఆరుగురు అగ్రగణ్యులలో ఒకరైన కామ్రేడ్ భీం రెడ్డి నర్సింహా రెడ్డి 17 వ వర్ధంతి సందర్భంగా కామ్రేడ్ బి యన్ స్మారక స్తూపావిష్కరణ, రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహిస్తున్న వర్ధంతి సభలను జయప్రదం చేయాలని యంసిపిఐ(యు) తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి గాదగోని రవి పిలుపునిచ్చారు.

కామ్రేడ్ భీం రెడ్డి నర్సింహా రెడ్డి నేటి సూర్యాపేట జిల్లా తుంగతుర్తి మండలం కర్విరాల కొత్తగూడెం లో 1922 మార్చి 15 వ తేదీన భీం రెడ్డి రాంరెడ్డి - చొక్కమ్మ దంపతులకు మొదటి సంతానంగా జన్మించారు.

కామ్రేడ్ బియన్ విద్యార్థి దశలో తన 14 వ ఏట తన గ్రామం తో పాటు చుట్టుపక్కల గ్రామాల్లో నాటి దొరల ఆగడాలు, నైజాం రజాకార్ల దౌర్జన్యాలు చూసి సహించలేక నాటి ఆంధ్రమహాసభ కార్యక్రమాల కు ఆకర్షితులై క్రమక్రమంగా వీర తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటానికి నేతృత్వం వహించిన ఆరుగురు అగ్రగణ్యులలో ఒకరై యావత్ తెలంగాణ సమాజానికి క్యూబా క్యాస్ట్రో గా మారారన్నారు. నాటి నైజాం, గ్రామాల్లో దొరలు, భూస్వాములు సాగిస్తున్న వెట్టిచాకిరి కి, ఆర్థిక దోపిడీ కి వ్యతిరేకంగా ప్రజలందరినీ చైతన్యం చేసి సాయుధ లు గా మలచడంలో, తుపాకీ కాల్చడం లో, దొరలను గడగడలాడించి, ఊదర బాంబుల ద్వారా దొర పీచాలను అణిచి వేసి, ఎక్కడ అరాచకం ఉంటే అక్కడ ప్రత్యక్షమై వెట్టి మనుషులు, మట్టి మనుషుల ను పోరాట యోధులు గా తీర్చిదిద్దిన అగ్రశ్రేణి నేత కామ్రేడ్ బియన్, పది లక్షల ఎకరాల భూ పంపిణీలో, మూడు వేల గ్రామ రాజ్యాల నిర్మాణం లో అగ్రశ్రేణి పాత్ర కామ్రేడ్ బియన్ గారిది. సాయుధ పోరాట సమయంలో మొదట ఆయుధం చేపట్టి విరమణ సమయం లో చివరికి ఆయుధం ఒదిలిన నేత కామ్రేడ్ బి యన్,

ప్రపంచ విప్లవోద్యమం లో చేగువేరా చెరుగని ముద్ర వేసినట్లుగా తెలంగాణ సాయుధ పోరాటం లోను, పోరాట విరమణ తరువాత సాగిన మహత్తర విప్లవ ఉద్యమాల్లో చెరుగని ముద్ర వేసిన కామ్రేడ్ బి యన్ ని ప్రముఖ తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధుడు చుక్క రామయ్య తెలంగాణ క్యాస్ట్రోగా కామ్రేడ్ బి యన్ ను అభివర్ణించారంటే బి యన్ ఎంత ప్రాముఖ్యత కలిగిన పాత్ర తెలంగాణ సమాజం లో నిర్వహించారో దీన్ని బట్టి విదితం అవుతుందన్నారు. ఉమ్మడి కమ్యూనిస్టు ఉద్యమం లో తరువాత సిపిఎం పార్టీ లో ప్రజల కోసం ప్రజా ఉద్యమాలు నిర్మిస్తూ అనేక ప్రజా విజయాలు ప్రజలకు సాధించి పెట్టిన కామ్రేడ్ బి యన్ రెండు సార్లు యం యల్ ఎ గా, మూడు సార్లు యం పి గా గెలుపొందిన తీరు చట్ట సభల్లో పీడిత ప్రజా పక్షాన జరిపిన పోరాటం పార్లమెంటు వెలుపల నిర్మించిన అనేక ప్రజా ఉద్యమాలకు కామ్రేడ్ బి యన్ నేతృత్వం వహించిన తీరు నేటి తరానికి ఆదర్శం అని అన్నారు. కమ్యూనిస్టు ఉద్యమం సామాజిక సమస్యను అణిచివేత ను గుర్తించటం లో వైఫల్యం కారణంగా అనేక ప్రజా ఉద్యమాలు బలహీన పడినాయి అని అందుకు సామాజిక న్యాయం కోసం త్యాగం చేయాలని పిలుపునిచ్చారు. యంసిపిఐ (యు) పోలిట్బ్యూరో సభ్యులుగా అఖిలభారత రైతు నేత గా సూర్యాపేట ప్రాంతానికి గోదావరి జలాలు సాధించాలని ప్రజా ఉద్యమం నిర్మించి నాటి ముఖ్యమంత్రి చే తిరుమలగిరి లో శ్రీ రాం సాగర్ 2 వ దశ కు శంకుస్థాపన చేసి గోదావరి జలాలను సాదించారు.

నల్గొండలో యూనివర్సిటీ, బీబీనగర్ నుంచి నడికుడ రైల్వే లైన్ సాధన పోరాటం లో ప్రముఖ పాత్ర నిర్వహించారు. ఈ లాంటి త్యాగధనుల చరిత్ర భవిష్యత్ తరాలకు అందించటానికి నేటి రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వం లు తక్షణమే స్పందించాలి అని అందుకు కామ్రేడ్ బి యన్ కాంస్య విగ్రహాన్ని హైదరాబాద్ ట్యాంక్ బండ్ పై ఏర్పాటు చేయాలని, నల్గొండ యూనివర్సిటీ కి బి యన్ గారి పేరు పెట్టాలని, యస్ ఆర్ యస్ పి రెండొవ దశకు బి యన్ గారి పేరు పెట్టడం ద్వారా తెలంగాణ పోరాట వారసత్వాన్ని గౌరవించి న వారు అవుతారు అని యంసిపిఐ(యు) తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి గాదగోని రవి అన్నారు. మే 9 వ తేదీన నేటి సూర్యాపేట జిల్లా తుంగతుర్తి శాసనసభ నియోజకవర్గం కేంద్ర లో అమరజీవి కామ్రేడ్ భీం రెడ్డి నర్సింహా రెడ్డి స్మారక స్తూపం ఆవిష్కరణ జరుగుతున్నది అని దీనికి ముఖ్య అతిథిగా పార్టీ అఖిలభారత ప్రధాన కార్యదర్శి కామ్రేడ్ మద్ది కాయల అశోక్ ఓంకార్ హాజరవుతున్నారన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల్లో 17 వ వర్ధంతి సభ లు జరుగుతున్నాయి అని

ఈ కార్యక్రమాలన్నీ జయప్రదం చేయాలని గాదగోని రవి పిలుపునిచ్చారు.




# వేసవి క్రీడా శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

- డి.సలీమ్ పాషా



హైదరాబాద్ / తొలిఅడుగు : విద్యార్థులు, యువత వేసవి క్రీడా శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని రంగారెడ్డి జిల్లా జర్నలిస్ట్ యూనియన్ అధ్యక్షుడు (టీయూడబ్ల్యూజే -ఐజేయూ) ఎం డి సలీమ్ పాషా పిలుపునిచ్చారు. గురువారం మోకీల గ్రామంలో తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వాలీబాల్ శిక్షణా తరగతులను పరిశీలించి పలు సూచనలు చేశారు. వేసవి సెలవుల్లో విద్యార్థులు ఆటలపై దృష్టి పెట్టాలన్నారు. సెల్ ఫోన్, టీవీ లకు దూరం అవ్వాలన్నారు. ఇలాంటి వేసవి శిబిరాల ద్వారా కోచ్ ల ద్వారా మంచి శిక్షణా పొంది మెళుకువలు తెలుసుకొని వివిధ పోటీల్లో పాల్గొని ప్రతిభ చాటాలన్నారు. గతంలో వేసవి క్రీడా శిబిరాలు గ్రేటర్ హైదరాబాద్, అర్బన్ ప్రాంతలకే పరిమితం అయ్యేవని, నేడు గ్రామీణ ప్రాంతాలకు విస్తరించడం శుభ పరిణామం అన్నారు. మట్టిలో మాణిక్యాలను వెలికితీయాటానికి ఇలాంటి శిబిరాలు దోహదం చేస్తాయన్నారు. మోకీల గ్రామానికి చెందిన ప్రముఖ ఉపాధ్యాయ సంఘ నేత, ఎందరో యువ క్రీడాకారులను తీర్చిదిద్దిన పాప ఆశీర్వాదం ప్రత్యేక చొరవ తీసుకుని ఈ క్రీడా శిబిరం విజయవంతం చేయటానికి చేస్తున్న కృషిని సలీమ్ పాషా కొనియాడారు. స్వతహాగా క్రీడాకారునిగా, క్రీడలపై ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తున్నా శిబిరం ఇంచార్జ్ పాప ఆశీర్వాదం సేవలను ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలన్నారు. ఈ శిబిరంలో పాల్గొంటున్న వారు భవిష్యత్తులో బాగా రాణించాలని, ఈ ప్రాంతానికి, తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులు, కోచ్ లకు మంచి పేరు తేవాలని ఆకాంక్షించి వారందరినీ అభినందించారు. ఈ సందర్భంగా సామాజిక కార్యకర్త, రాష్ట్ర ఉత్తమ ఉపాద్యాయ అవార్డు గ్రహీత శిబిరం ఇంచార్జ్ పాప ఆశీర్వాదం మాట్లాడుతూ ... తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ సహకారంతో ప్రతి ఏటా ఈ వేసవి శిభిరాన్ని నిర్వహిస్తున్నట్లు,13 సంవత్సరాలుగా కొనసాగుతుందన్నదన్నారు. గ్రామంలో క్రీడా ప్రాంగణానికి మంచి స్థలాన్ని కేటాయించి అన్ని సౌకర్యాలు కల్పించిన మాజీ సర్పంచ్, ఎంపీటీసీలకు ధన్యవాదాలు తెలిపారు. ప్రతి రోజు మోకీల, కొండకల్, బుల్కాపూర్, వెలిమేల, మోకీల తండా, కొండకల్ తండా ల నుండి సుమారు 50 మంది హాజరవుతున్నారని ఆయన తెలిపారు.







# మౌలిక వసతుల కల్పన సాఫ్ట్‌వేర్ కంపెనీ కృషి

- 11లక్షక రూపాయలతో సౌకర్యాల ఏర్పాటు
- కృతజ్ఞతలు తెలిపిన బస్తీ వాసులు



కూకట్ పల్లి / తొలిఅడుగు : కూకట్‌పల్లి నియోజకవర్గ పరిధిలో ఓ బస్తీలో మౌలిక వసతుల కల్పన కోసం ఓ ప్రముఖ సాఫ్ట్‌వేర్ కంపెనీ ముందుకు వచ్చింది. మౌలిక వసతుల కోసం రూ.11 లక్షలు ఇవ్వడానికి సిద్ధమైనట్లు ప్రకటించిందని కాలనీ వాసులు తెలిపారు. ఈ విషయాన్ని తెలియజేయగానే సానుకూలంగా స్పందించి సేవ కార్యక్రమానికి ముందుకు వచ్చారని తెలిపారు. బురుగుపల్లి రామ్ మోహన్ అభ్యర్థన మేరకు ఒక ప్రఖ్యాత సాఫ్ట్‌వేర్ కంపెనీ అంగీకరించి, భారత్ వికాస్ పరిషత్ విద్యాలయ స్కూల్, దీన్ దయాల్ నగర్, ఫతేనగర్ డివిజన్, కూకట్‌పల్లి నియోజకవర్గం, మేడ్చల్ మల్కాజ్‌గిరి పార్లమెంటును ఎన్జీవో, యునైటెడ్ వే ఆఫ్ హైదరాబాద్ బృందంతో కలిసి సందర్శించింది. సంక్షేమ అధ్యక్షులు, పాఠశాల ఉపాధ్యాయులు, కాలనీ సభ్యులతో చర్చించింది. దాదాపు 11 లక్షలు ఖర్చు చేయడానికి అంచనా వేసి అంగీకరించింది. ఇందులో కాంపౌండ్ వాల్ నిర్మాణం గేటు, బాత్రూమ్, వాష్ రూమ్, హ్యాండ్ వాష్, వాటర్ ట్యాంక్, కిటికీలు, తలుపులు, లోపల వెలుపల పెయింటింగ్, కళాకృతులు, ఫ్యాన్లు, ట్యూబ్ లైట్లు, ఎలక్ట్రికల్ వర్క్, కుర్చీలు, ప్లాట్‌ఫాం నిర్మాణం, 3 గదుల పునరుద్ధరణ మొదలైనవి ఉన్నాయి. అడగగానే గొప్ప మనసు చేసుకొని ముందుకు వచ్చి సహకరించిన ప్రముఖ సాఫ్ట్వేర్ కంపెనీ ప్రతినిధి పెద్దలు శ్రీ పాండురంగారావుకు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలియజేస్తున్నామన్నారు. శ్రీ బురుగుపల్లి రామ్మోహన్ కు యునైటెడ్ వే ఆఫ్ హైదరాబాద్ బృందానికి బస్తి వాసుల తరపున కృతజ్ఞతలు తెలియజేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న దీన్ దయాల్ నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రెసిడెంట్ విజయ భాస్కర్ రెడ్డి సెక్రటరీ హరి ప్రసాద్ నాయుడు కంటెస్టెంట్ సెక్రటరీ భవాని నాగేష్ ముదిరాజ్ అంగన్వాడి టీచర్ స్వప్న, కుర్మీ ఫారిద్ బస్తీ వాసులు పాల్గొన్నారు.

# ఆయుర్వేదం మన సంప్రదాయ వైద్యం

- రిటైర్డ్ ఐఏఎస్ అజయ్ మిశ్రా






నలగండ్ల / తొలిఅడుగు : ఆయుర్వేదం మన సాంప్రదాయ వైద్యమని రిటైర్డ్ ఐఏఎస్ అజయ్ మిశ్రా అన్నారు. గురువారం ఆయన ఆయుర్వేద హాస్పిటల్ ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. శేరిలింగంపల్లి, నల్లగండ్లలో ఇందూ ఆయుర్వేద క్లినిక్ ప్రారంబించారు.

ఆయుర్వేదం మన సంప్రదాయ చికిత్స అని ఈ మందుల ద్వారా ఎటువంటి దుష్ప్రభావాలు ఉండవని తెలిపారు. నల్లగండ్లలో నూతనంగా ఏర్పాటు చేసిన ఇందు ఆయుర్వేద హాస్పిటల్ ప్రారంభోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. హాస్పిటల్ వైద్య సిబ్బందితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. మన ప్రాచీన వైద్య చికిత్సలో ఎంతో ప్రసిద్ధిగాంచిన ఆయుర్వేద హాస్పిటల్ ను అందరికీ అందుబాటులో ఉండేలా నల్లగండ్లలో ప్రారంభించడం సంతోషంగా ఉందన్నారు. ఆయుర్వేదం మన సంప్రదాయ చికిత్స, దీని ద్వారా ఎలాంటి దుష్ప్రభావాలు ఉండవన్నారు. ఎంతోకాలంగా ఆయుర్వేద చికిత్స విధానాలను అనుసరిస్తున్నానని, తద్వారా 35 ఏళ్ల పాటు ఎలాంటి సమస్యలు లేకుండా ప్రభుత్వానికి సేవలందించానన్నారు. మానసిక, శారీరక రుగ్మతలతో పాటు దీర్ఘకాలిక రోగాలకు సైతం మెరుగైన వైద్య చికిత్సలో ఆయుర్వేదంలో అందుబాటులో ఉన్నాయని వైద్యులు ప్రదీప్ నోరి అన్నారు. ఈ తెలంగాణ కాంగ్రెస్ కమిటీ చైర్మన్ పవన్ మల్లాడి, కార్యక్రమంలో డాక్టర్ వంశీధర్ అల్లం, డాక్టర్ సుష్మ తదితరులు పాల్గొన్నారు.

# ఆబ్కారీ దాడులు ..

- 14 కిలోల గంజాయి స్వాధీనం

తొలిఅడుగు : భువనేశ్వర్ నుంచి సికింద్రాబాద్ మీదుగా ముంబై వెళ్తున్న కోణార్ ఎక్స్‌ప్రెస్ రైలులో ఆబ్కారీ ఎస్టీఎఫ్ పోలీసులు తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో 10కిలోల గంజాయి ని స్వాధీనం చేసుకున్నారు. వివరాల్లోకి వెళ్తే.భువనేశ్వర్ నుంచి ముంబై వెళ్లే రైలులో గంజాయి రవాణా జరుగుతున్నట్లు అందిన సమాచారం మేరకు గురువారం ఎస్టీఎఫ్ సీఐలు వెంకటేశ్వర్లు, నాగరాజులు..

సిబ్బందితో కలిసి కోణార్క్ ఎక్స్ ప్రెస్‌లో ఖాజీపేట నుంచి సికింద్రాబాద్ వరకు తనిఖీలు నిర్వహించారు. ఈ క్రమంలో రైలులో అనుమానాస్పదంగా ఉన్న మూడు ప్యాకెట్లను తె రిచి చూడగా గంజాయి బయట పడిం ది. ఈ మొత్తం గంజాయి 10కిలోలు ఉన్నట్లు అధికారులు తెలిపారు. అయితే అక్కడ ఎవరూ లేకపోవడంతో ఎస్టీఎఫ్ బృందాలు గంజాయిని స్వాధీనం చేసుకున్నాయి. తదుపరి విచారణ నిమిత్తం కేసును సికింద్రాబాద్ ఎక్సైజ్ పోలీసులకు అప్పగించారు.

మరో కేసులో %నారాయణగూడ, వైఎంసీఏ ప్రాంతా ల్లో గంజాయి విక్రయాలకు పాల్పడుతున్న ఇద్దరిని ఆబ్కారీ ఎస్టీఎఫ్ పోలీసులు పట్టుకున్నారు. నిందితుల నుంచి 2.5కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. వివరాల్లోకి వెళ్తే%%నగరానికి చెందిన ఆటోడ్రైవర్ విక్కీ పటేల్ ధూల్‌పేట నుంచి గంజాయి కొనుగోలు చేసి నారాయణగూడ, వైఎంసీఏ ప్రాంతాల్లో విక్రయిస్తుంటాడు. ఈ క్రమంలోనే విక్కీ పటేల్ గురువారం మధ్యాహ్నం ధూల్‌పేట నుంచి తీసుకువచ్చిన గంజాయిని నారాయణగూడ, వైఎంసీఏ ప్రాంతం లో మరో ఆటోడ్రైవర్ సుమంత్‌కు విక్రయిస్తుండగా సమాచారం అందుకున్న ఎస్టీఎఫ్ పోలీసులు వారిద్దరిని రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకుని అరెస్ట్ చేశారు. వారి నుంచి 2.5కిలోల గంజాయితోపాటు రెండు ఆటోలు, మూడు సెల్‌ఫోన్‌లను సీజ్ చేశారు. కేసును తదుపరి విచారణ నిమిత్తం నారాయణగూడ ఎక్సైజ్ పోలీసులకు అప్పగించారు.

రహీంపురాలో%%ధూల్ పేటకు ఆనుకుని ఉన్న రహింపూరలోని ఒక ఇంట్లో గంజాయి విక్రయిస్తున్న ముగ్గురు వ్యక్తులను ఎస్టీఎఫ్ పోలీసులు అరెస్టు చేశారు. నిందితుల వద్ద నుంచి 1.518కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. వివరాల్లోకి వెళ్తే%%ధర్మసింగ్, మహేశ్‌సింగ్ , మనోజ్ సింగ్‌లు ధూల్‌పేటలోని ఇంట్లో గంజాయి విక్రయాలకు పాల్పడుతున్నారు. సమాచారం అందుకున్న ఆబ్కారీ పోలీసులు గురువారం వారి నివాసాలపై దా డులు జరిపి.. ముగ్గురు నిందితులను అరెస్టు చేసి, వారి నుంచి 1.518కిలోల గంజాయిని స్వాధీనం చేసున్నారు.

2.370 కిలోలు స్వాధీనం

పోచారం,మే 8: గంజాయి తరలిస్తున్న ఇద్దరిని ఘట్‌కేసర్ ఎక్సైజ్ పోలీసులు అరెస్ట్ చేశారు. వారి నుంచి 2.370 కిలోలను స్వాధీనం చేసుకున్నారు. ఎక్సైజ్ సీఐ రవి వివరాల ప్రకారం.. బోడుప్పల్ డంపింగ్ యార్డు ఎదురుగా ఉన్న సబ్‌స్టేషన్ సమీపం నుంచి భాస్కర్‌రావు, బొంత సురేశ్‌లు యాక్టివాపై ఎండు గంజాయి తరలిస్తున్నారు. సమాచారం అందుకున్న పోలీసులు వాహనాన్ని ఆపి తనిఖీ చేయగా 2.370 కిలోల గంజాయి బయటపడింది. వెంటనే వారిద్దరిని అదుపులోకి తీసుకున్నారు. దీనితో సంబంధం ఉన్న దినకర్, నానిలు పరారీలో ఉన్నారని తెలిపారు.

# బైక్ పార్కింగ్ విషయంలో గొడవ.. దాడి




తొలిఅడుగు : దుండిగల్, : బైక్ పార్కింగ్ విషయంలో తలెత్తిన వివాదంలో ఇద్దరిపై దాడికి పాల్పడిన ఐదుగురు నిందితులను బాచుపల్లి పోలీసులు అరెస్టు చేసి రిమాండ్ కు తరలించారు. పోలీసుల కథనం ప్రకా రం%%% నిజాంపేటలోని ఇందిరమ్మ కాలనీ ఫేస్ -1లో గుడిపల్లి సంతోశ్‌కుమార్ అనే వ్యక్తి తన కుటుంబంతో కలిసి నివాసం ఉంటున్నాడు.

అయితే అదే బ్లాక్ లోని ఓ ఫ్లాట్‌లో బిహార్‌కు చెందిన ధీరజ్ కుమార్ అద్దెకు ఉంటుండగా సమీపంలోని వేరువేరు బ్లాకుల్లో అతని దగ్గరి బంధువులు ఉంటున్నారు. ఈ నేపథ్యంలో సంతోశ్‌కు చెందిన బైక్ పార్కింగ్ స్థలంలో ధీరజ్ కుమార్ తరచూ బైక్ పార్కింగ్ చేస్తున్నాడు. పక్కకు జరపమని చెబితే గొడవకు దిగేవా డు. ఈ క్రమంలో ఈనెల 6న రాత్రి 11 :30 గంటల సమయంలో ధీరజ్ కుమార్ బంధువు ఒకరు సంతోశ్‌కు చెందిన పార్కింగ్ స్థలంలో ద్విచక్ర వాహనాన్ని పార్క్ చేశాడు.

అయితే సంతోశ్.. బైక్‌ను పక్కకు పెట్టమని ధీరజ్‌కుమార్ బంధువుకు చెప్పి.. ఇంట్లోకి వెళ్లిపోయాడు. కొద్దిసేపటి అనంతరం ధీరజ్ కుమార్ బయటకు వచ్చి సంతోష్‌తో గొడవ పడి కొట్టాడు. పక్కబ్లాక్‌లో నివాసం ఉంటున్న బంధువులు సంతోశ్‌సింగ్, రోహిత్ కుమార్ సింగ్, మరో ఇద్దరు వచ్చి ఇనుప రాడ్లు, కర్రలతో సంతోశ్‌ను కొట్టి గాయపరిచారు. అడ్డుకోబోయి న సంతోశ్ బంధువు అబ్రహంపైన దాడికి తెగబడ్డారు. ఈ దాడుల్లో వారిద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. దీంతో బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేయగా నిందితులైన ధీరజ్‌కుమార్, కుమార్ సింగ్, రామ్ రతన్ సింగ్, సంతోశ్‌సింగ్, రోహిత్ సింగ్‌లను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

# సంపాదకీయం

కీలుబొమ్మలుగా దర్యాప్తు సంస్థలు

విధి నిర్వహణలో దర్యాప్తు సంస్థల పాత్ర తరచూ వివాదాస్పదమవుతోంది. బాధ్యతాయుతంగా దర్యాప్తు చేపట్టి, నేరాలకు ముకుతాడు వేయడంలో కీలకపాత్ర పోషించవలసిన దర్యాప్తు సంస్థలు అధికారంలో ఉన్నవారికి కొమ్ము కాస్తున్నాయని, పాలకుల చేతిలో కీలుబొమ్మలుగా మారుతున్నాయని తరచూ విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. విపక్ష పార్టీలు ఈ రకమైన ఆరోపణలు చేయడాన్ని అర్ధం చేసుకోవచ్చు కానీ, ప్రజాస్వామికవాదులు, న్యాయస్థానాలు సైతం దర్యాప్తు సంస్థల పనితీరుపై అనుమానాలు వ్యక్తం చేయడం గమనించవలసిన విషయం. ఒకప్పుడు కేంద్ర దర్యాప్తు సంస్థ (సిబిఐ)పై మాత్రమే ఆరోపణలు ఉండేవి. కానీ, కేంద్రంలో భారతీయ జనతా పార్టీ అధికారంలోకి వచ్చాక, ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఇడి), ఇన్‌కంటాక్స్ డిపార్ట్‌మెంట్ (ఐటి) వంటి సంస్థలకు కూడా ఈ మకిలి అంటింది. రాజకీయ ప్రత్యర్థులపై కక్ష సాధింపునకు ఈ రెండూ కేంద్రం చేతిలో పావులుగా మారాయంటూ విమర్శలు రావడం పరిపాటిగా మారింది.తాజాగా చత్తీస్‌గఢ్‌కు చెందిన ఓ కేసు విషయంలో సర్వోన్నత న్యాయస్థానం ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ వ్యవహార శైలిపై తీవ్రమైన వ్యాఖ్యలు చేసింది. 'మూడు చార్జిషీట్లు దాఖలయ్యాయి. మీరు నిందితుడిని కస్టడీలో ఉంచి శిక్షిస్తున్నారు. విచారణ ప్రక్రియనే శిక్షగా మార్చారు' అంటూ ఆగ్రహం వ్యక్తం చేసింది. సరైన ఆధారాలు సేకరించకుండా కొందరు వ్యక్తులపై అభియోగాలు మోపుతున్న తీరును విమర్శిస్తూ, ఎప్పుడూ ఇదే తీరంటూ ఈసడించింది. ఆమాటకొస్తే, ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్‌ను న్యాయస్థానాలు తప్పుపట్టడం ఇదే మొదటిసారి కాదు. గత ఏడాది ఆగస్టులోనూ ఓ కేసుకు సంబంధించి సుప్రీంకోర్టు ఇడిని తీవ్రస్థాయిలో మందలించింది. 'ఏ వ్యక్తి స్వేచ్ఛనూ హరించకూడదు. వ్యక్తి స్వేచ్ఛ అనేది ఒక నియమమే. దాన్ని కోల్పోవడమనేది మినహాయింపుగానే ఉండాలి. ఆ స్వేచ్ఛపై నియంత్రణ విధిస్తే అది చట్టబద్ధంగానే జరగాలి. బెయిలివ్వడానికి మనీలాండరింగ్ చట్టంలోని సెక్షన్ 45 ప్రకారం రెండు షరతులు ఉన్నాయి. అంతమాత్రాన వ్యక్తి స్వేచ్ఛను హరించడమే ప్రమాణమని ఆ నిబంధన ఎక్కడా చెప్పలేదు' అని చీవాట్లు పెట్టింది. వ్యక్తులను అరెస్టు చేయడానికి, రోజుల తరబడి కస్టడీలో ఉంచడానికి మనీలాండరింగ్ చట్టం ఇడికి ఒక ఆయుధంగా మారిందనేది సర్వత్రా వినిపిస్తున్న విమర్శ. నిందితులను జైలుకు పరిమితం చేసేందుకు ఈ చట్టం ఉపయోగపడుతోందన్నది పలువురి అభియోగం. ఈ చట్టం కింద నమోదైన కేసులు ఎక్కువ కాలం పెండింగులో ఉంటున్న మాట వాస్తవమేనంటూ ఇటీవల ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరే స్వయంగా అంగీకరించడం చట్టం అమలులోని లొసుగులను బహిర్గతం చేస్తోంది. మామూలు నేరాల్లో ఎవరిపైనైనా కేసు నమోదు చేస్తే ఎఫ్‌ఐఆర్ దాఖలు చేసి, దాన్ని సదరు వ్యక్తికి అందజేయడం తప్పనిసరి. ఇడి కేసుల్లో ఇలా ఇసిఐఆర్‌ను విడుదల చేస్తారు. కానీ దాన్ని నిందితులకు తప్పనిసరిగా ఇవ్వాలన్న నిబంధన మనీలాండరింగ్ చట్టంలో లేదు. పైగా ఈ చట్టం కింద ఇడి అధికారులు ఎవరికైనా సమన్లు పంపి విచారించే అధికారం ఉంటుంది. తాను సాక్షినో, ముద్దాయినో సదరు వ్యక్తికి తెలియదు. ఇలా ఇడి అధికారులకు అపరిమితమైన అధికారాలు కట్టబెట్టిన మనీలాండరింగ్ చట్టంవల్ల నిందితులకు బెయిల్ దొరకడం దుర్లభమవుతోందనే విషయం ఇప్పటికే అనేక కేసులలో రుజువైంది కూడా. ఈ చట్టంపై వెల్లువెత్తుతున్న విమర్శలను, దాఖలవుతున్న పిటిషన్లను గమనించిన సర్వోన్నత న్యాయస్థానం 2022లో ఈ చట్టం కింద ఇడికి తాను స్వయంగా దాఖలు పరచిన అధికారాలను పునస్సమీక్షించేందుకు ముగ్గురు న్యాయమూర్తులతో కూడిన ధర్మాసనాన్ని ఏర్పాటు చేయడం తాజా పరిణామం. ఇరవైరెండేళ్ల క్రితం రూపొందిన ప్రివెన్షన్ ఆఫ్ మనీలాండరింగ్ చట్టం (పిఎంఎల్ఎ)2005 జూలైనుంచి అమలులోకి వచ్చింది. అయినా తొలినాళ్లలో ఈ చట్టం అంత ప్రభావవంతంగా అమలు కాలేదు. పిఎంఎల్ఎ కింద తొలి చార్జిషీటు 2012 లో దాఖలైందంటే దర్యాప్తు సంస్థ పనితీరు ఎంత నత్తనడకగా ఉండేదో అర్థం అవుతుంది. అయితే, 2014లో కేంద్రంలో ఎన్‌డిఎ ప్రభుత్వం ఏర్పడ్డాక, ఇడి దూకుడు పెరిగింది. వరుస కేసుల నమోదుతో ఆర్థిక నేరగాళ్ల గుండెల్లో గుబులు పుట్టించింది. అయితే, ఈ దూకుడు వెనక అప్పటి కేంద్రంలోని పెద్దల హస్తం ఉందనే విమర్శలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో మనీలాండరింగ్ చట్టంలో లోటుపాట్లను సవరించేందుకు సుప్రీంకోర్టు నడుం బిగించడంతో ఇకపై నిందితులకు ఊరట లభిస్తుందని భావించవచ్చు. మరోవైపు, ఆర్థిక చట్టాల అమలులోనూ, ఆర్థికపరమైన నేరాలను అరికట్టడంలోనూ కీలకపాత్ర వహించే ఇడి ఇకనైనా స్వతంత్రంగా వ్యవహరించవలసిన అవసరం ఉంది. పాలకుల చేతిలో కీలుబొమ్మగా మారిందనే అపప్రథను తొలగించుకోవాలంటే, ముందుగా రాజకీయ నేతల ఉచ్చులోంచి బయటపడాలి. నేతల ఒత్తిళ్ళకు లొంగకుండా పనిచేసి తన చిత్తశుద్ధిని నిరూపించుకోవాలి.

## ఉపాధి హామీ కూలీల మధ్యల మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్ పుట్టిన రోజు వేడుకలు జరిపిన కాంగ్రెస్ నేతలు

**– కూలీలకు మజ్జిహ ప్యాకెట్లు పంపిణీ చేసిన అజ్జు యాదవ్**



తొలిఅడుగు, చిన్నకోడూరు, మే 08 : సిద్దిపేట జిల్లా చిన్నకోడూరు మండలం చెర్లఅంకిరెడ్డిపల్లి గ్రామంలో తెలంగాణ రాష్ట్ర రవాణా మరియు బీసీ సంక్షేమ శాఖల మంత్రివర్యులు తన అభిమాన నాయకుడు శ్రీ పొన్నం ప్రభాకర్ గారి 58 వ పుట్టిన రోజు సందర్భంగా వారిపై అభిమానంతో సిద్దిపేట నియోజకవర్గ యువజన కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి అజ్జు యాదవ్ కాంగ్రెస్ కార్యకర్తలతో కలిసి ఉపాధి హామీ కూలీలకు సల్ల ప్యాకెట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సల్ల ప్యాకెట్లు తీసుకున్న ఉపాధి హామీ కూలీలు మంత్రి పొన్నం ప్రభాకర్ ను నాయకుడా నిండు నూరేళ్లు వర్ధిల్లు అంటూ దీవించారు, తన వద్దకు వచ్చే వారందరినీ ఆప్యాయంగా పలకరిస్తూ వారి సమస్యలను తెలుసుకొని తీర్చే మంత్రి మాకు అందుబాటులో ఉండడం చాలా సంతోషమని అన్నారు. అలాగే సిద్దిపేట బస్టాండ్ లో మా గ్రామం పేరు ఒక ప్లాట్ ఫారంపై ఏర్పాటు చేయడం చాలా సంతోషకరమైన విషయమని గుర్తు చేసుకున్నారు. ఉచిత బస్సు ప్రయాణం వల్ల మహిళలంతా సంతోషంగా ఉన్నామని తెలిపారు. అనంతరం హుస్నాబాద్ ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో మంత్రి పొన్నం ప్రభాకర్ గారిని కలిసి శుభాకాంక్షలు తెలియజేసిన సిద్దిపేట నియోజకవర్గ యువజన కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి అజ్జు యాదవ్ మరియు కాంగ్రెస్ నాయకులు ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ బీసీ సెల్ సిద్దిపేట జిల్లా కార్యదర్శి చిక్కుడు అనిల్ కుమార్,చిన్నకోడూరు మండల యువజన కాంగ్రెస్ ఉపాధ్యక్షులు చింతల రాజు యాదవ్,ఇందిరమ్మ కమిటీ సభ్యులు చింతల రాజు యాదవ్, కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు భైరోజు రమేష్ చారి, గొల్లపల్లి శ్రీనివాస్ గౌడ్,రాజబోయిన మల్లేశం యాదవ్, కూన సంతోష్ ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

## బెతెస్త ప్రార్థన మందిరంలో పాస్టర్ కృపాకర్ ఆధ్వర్యంలో అంబరాన్నంటిన విబిఎస్ సంబరాలు

**– మానసిక ఉత్తేజాన్ని పెంపొందించే స్కిట్లు, బోధనలు, డాన్సులతో నాలుగు రోజులు ఘనంగా విబిఎస్ సంబరాలు**



తొలిఅడుగు, మణుగూరు మే 08 : భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వాపురం మండలం చింతిర్యాల క్రాస్ రోడ్ లోని బేతేస్తా ప్రార్ధనా మందిరములో పాస్టర్ కృపాకర్ ఆధ్వర్యంలో గత నాలుగు రోజుల నుండి విరామ బైబిల్ స్కూల్ (విబిఎస్) తరగతులు నిర్వహించబడ్డాయి ప్రతి రోజు సుమారు రెండు వందలకు పైగా చిన్నారులతో పలు సంస్కృతికా కార్యక్రమాలు మరియు ధైవిక జ్ఞానం పెంపోందించే బోధనలు, మానసిక ఉత్తెజాన్ని పెంపోందించే స్కిట్లుతో చిన్నారులు అలరించారు ఈ నాలుగు రోజులు చిన్నారులతో బెతేస్తా ప్రార్ధన మందిరంలో సంబరాలు ఘనంగా జరిగాయి, జరిగిన నాలుగు రోజులు సుమారుగా 200 పైన చిన్నారులకు, స్నాక్స్, జ్యూసులు, భోజనా సదుపాయాలు అందించి చిన్నారులకు ఎటువంటి లోటు లేకుండా దగ్గరుండి అన్ని సదుపాయాలు పాస్టర్ కృపాకర్ అండ్ టీం దగ్గరుండి చూసుకున్నారు,చివరి రోజు ఉదయం ఎనిమిది గంటల నుండి మధ్యాహ్నం ఒంటిగంట వరకు చిన్నారులతో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించి చిన్నారులకు సర్టిఫికెట్స్, గిఫ్ట్స్ అందజేశారు ఈ కార్యక్రమం విజయవంతంగా జరగడానికి టీచర్స్ గా మెర్సీ, రంజిత, శిల్ప, హెలెన్, రత్నశ్రీ, దీపా ఫ్లారెన్స్ కు పాస్టర్ కృపాకర్ కృతజ్ఞతలు తెలియజేసారు ఈ కార్యక్రమంలో సంతపురి సతీష్, గొల్లపల్లి నరేష్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.





## సీఎంఆర్ఎఫ్ పేదలకు వరం

**– ఎమ్మెల్యే పల్లా పల్లా రాజేశ్వర్ రెడ్డి చేతుల మీదుగా లబ్ధిదారులకు చెక్కుల పంపిణీ**





తొలిఅడుగు, జనగామ, మే 08 : సీఎంఆర్ఎఫ్ పేదలకు వరం అని జనగామ ఎమ్మెల్యే డా. పల్లా రాజేశ్వర్ రెడ్డి అన్నారు. గురువారం చేర్యాల పట్టణ కేంద్రంలో సీఎం సహాయనిధి నుంచి మంజూరైన చెక్కులను జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి 19మంది లబ్ధిదారులకు రూ. 4,82,500 విలువైన చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ ప్రతి ఒక్కరికి ప్రభుత్వ పథకాలు అందేలా కృషి చేస్తానని పేర్కొన్నారు. ఆపదలో ఆసుపత్రిలో చేరిన వారికి సీఎం సహాయనిధి ఎంతో ఉపయోగపడుతుందన్నారు.

# జూన్ వారం లోపు పనులను పూర్తి చేయాలి

- పనుల విషయంలో ఆలస్యం వహించొద్దు.
- అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులను పరిశీలించిన ఎమ్మెల్యే డా. పల్లా రాజేశ్వర్ రెడ్డి



తొలిఅడుగు, జనగామ, మే 08 : జూన్ వారం లోపు అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులను పూర్తి చేయాలని జనగామ ఎమ్మెల్యే డా. పల్లా రాజేశ్వర్ రెడ్డి అన్నారు. గురువారం

జనగామ పట్టణంలోని 3వ వార్డు మాజీ కౌన్సిలర్ సుధా సుగాణాకర్ రాజుతో కలిసి ఆయన అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా పనులను త్వరితగతిన పూర్తి చేయాలి. పనుల విషయంలో ఆలస్యం వహించొద్దన్నారు. ప్రతీ వారం వచ్చి పనులను పరిశీలిస్తానని అధికారులకు సూచించారు.

# శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయంలో ద్వితీయ వార్షికోత్సవం

- ముఖ్యఅతిథిగా పాల్గొన్న జనగామఎమ్మెల్యే డా. పల్లా రాజేశ్వర్ రెడ్డి



తొలిఅడుగు, జనగామ, మే 08 : జనగామ పట్టణంలోని రైల్వే స్టేషన్ పరిధిలో గల శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయంలో గురువారం శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి, శ్రీ నగేశ్వరి, శ్రీ సీతారామ చంద్రస్వామి ద్వితీయ వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జనగామ ఎమ్మెల్యే డా. పల్లా రాజేశ్వర్ రెడ్డి హాజరై, దేవతల దివ్య దర్శనం తీసుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు సంప్రదాయ బద్ధంగా పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇలాంటి ఆధ్యాత్మిక కార్య క్రమాలు సమాజానికి శాంతిని, సౌభాగ్యాన్ని కలిగిస్తాయని అన్నారు. ఆలయ అభివృద్ధికి తమ పూర్తి సహకారం ఉంటుందని భరోసా ఇచ్చారు.

# భారత ఆర్మీ బాగుండాలని ప్రత్యేక పూజలు చేసిన హనుమాన్ స్వాములు

– జంగిటి శ్రీనివాస్ ముదిరాజ్



తొలిఅడుగు, చిన్నకోడూర్, మే 08 : భారత ఆర్మీకి ఎలాంటి ఆపద సంభవించద్దని ప్రత్యర్థి దేశమైన పాకిస్తాన్ పైన విజయం సాధించాలని భారత ప్రజలు సుభిక్షంగా ఉండాలని శేరిపల్లి ఆంజనేయస్వామి దేవస్థానంలో హనుమాన్ స్వాములు ప్రత్యేక పూజలు నిర్వహించడం జరిగిందని గురుస్వామి బి ఆర్ ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు జంగిటి శ్రీనివాస్ ముదిరాజ్ అన్నారు.

మాజీ మంత్రి సిద్ధిపేట ఎమ్మెల్యే హరీష్ రావు ఆదేశాల మేరకు గురువారం రోజు హనుమాన్ స్వాములతో కలిసి జంగిటి శ్రీనివాస్ ముదిరాజ్ సేరిపెల్లి వీరాంజనేయ స్వామి దేవస్థానంలో భారత ఆర్మీ కోసం భారత ప్రజల కోసం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ... స్వాతంత్రం వచ్చిన నాటి నుండి భారత్ నుండి పాకిస్తాన్ విడిపోయి భారత్ పైన దాడులకు పాల్పడుతూ భారత అమాయక ప్రజలను పొట్టని పెట్టుకుంటూ భారత ఆర్మీ పై దొంగ చాటున దాడులు చేస్తూ వస్తున్నారని మొన్నటికి మొన్న పెహల్గాంలో అమాయక ప్రజలైన 26 మందిని పాకిస్తాన్ ఉగ్రవాదులు పొట్టన పెట్టుకున్నారని మరి దానికి దీటుగా ఆపరేషన్ సింధూర్ భారత ప్రభుత్వం చేపట్టి ఆర్మీ విజయం సాధించిందన్నారు. మునుముందు భారత ఆర్మీ ఇలాంటి విజయాలు ఎన్నో సాధించాలని విజయ సాధనలో భారత ఆర్మీకి ఎలాంటి హాని జరగకూడదని భారత ఆర్మీకి ఆంజనేయ స్వామితో పాటుగా దేవుని అందరూ అండగా ఉండి భారత ఆర్మీ ని భారత ప్రజలను రక్షించాలని అదేవిధంగా ఉగ్రవాద దాడిలో అసువులు బాసిన భారత ప్రజలు ఆర్మీ జవాన్లు మరి వారి పవిత్ర ఆత్మకు శాంతి కలగాలని ఈ ప్రత్యేక పూజలు నిర్వహించినట్లుగా ఆయన తెలిపారు. భారత ప్రభుత్వం పాకిస్తాన్ పైన ఎలాంటి చర్యలు తీసుకున్న హనుమాన్ భక్తులుగా భారతదేశ పౌరులుగా స్వాగతిస్తూ మద్దతునిస్తామని టిఆర్ఎస్ పార్టీ కార్యకర్తగా హనుమాన్ భక్తులుగా యుద్ధంలో సైతం పాల్గొనడానికి సిద్ధమని అన్నారు. ఈ కార్యక్రమంలో దయ్యాల పవన్, కనుగుల శ్రీనివాస్, మోహన్, నాగరాజు, రాకేష్ పంతులు, చంద్రారెడ్డి హనుమాన్ స్వాములు పాల్గొన్నారు.

# ఆంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన ఆంజనేయ స్వాములు

తొలిఅడుగు, గజ్వేల్ మే 08 : గ్రామ ప్రజలను చల్లగా చూడాలని సిద్దిపేట జిల్లా గజ్వేల్ మండలం అహ్మదిపుర్ గ్రామంలో చిన్న పెద్దలు తేడా లేకుండా హనుమాన్ స్వామి మాలలు ధరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామ ప్రజలను పాడిపంటలు ఆయురారోగ్యాలతో ఉంచాలని శ్రీ ఆంజనేయస్వామి, రాముల వారి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు ఆంజనేయస్వామి ప్రజల సుఖ సంతోషాలతో ఉండే విధంగా ప్రజలపై నీ చల్లని చూపు ఉండాలని ఆంజనేయస్వామిని ప్రార్థించారు ఈ కార్యక్రమంలో ఆంజనేయ స్వాములు పాల్గొన్నారు.



# అన్నదానం

తొలిఅడుగు, జనగామ, మే 08 : బల్ల శకుంతల జ్ఞాపకార్థం భర్త బాల్ నరసింహులు, కొడుకు కోడలు బల్ల మోహన్ - పావని జనగామ పట్టణం లోని రాజరాజేశ్వరి వృద్ధాశ్రమంలో మహా అన్నదాన కార్యక్రమం నిర్వహించి ఘనంగా బల్ల శకుంతల ని కుటుంబ సభ్యులు స్మరించుకున్నారు. ఈ సందర్భంగా అమ్మ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంతెన మణికుమార్ ముఖ్య సలహాదారుడు వంగ బీమ్ రాజ్ మాట్లాడుతూ రాజరాజేశ్వరి దేవస్థానం లో మహా అన్నదాన కార్యక్రమం నిర్వహించిన బల్ల శకుంతల కుటుంబ సభ్యులకు ధన్యవాదాలు తెలియజేశారు. నిరంతరం సేవే లక్ష్యంగా అమ్మ ఫౌండేషన్ సేవా కార్యక్రమాలను ముందుండి నడిపిస్తున్న అమ్మ ఫౌండేషన్ ప్రతినిధి బింగి నరసింహులు, వెంగళ వరుణ్, సేవలను కొనియాడారు.





# దుర్గమ్మ ఆలయాన్ని దర్శించుకున్న మాజీ మంత్రి



తొలిఅడుగు, జనగామ, మే 08 : జనగామ జిల్లా ఉద్యమ కేసులో భాగంగా జనగామ జిల్లా కోర్టుకి హాజరైన మాజీ మంత్రివర్యులు పొన్నాల లక్ష్మయ్య .. అనంతరం జనగామ గిర్నిగడ్డ ప్రాంతములో దుర్గమ్మ ఆలయ కమిటీ ఆహ్వానం మేరకు దుర్గమ్మ గుడికి వెళ్లి అమ్మవారిని దర్శించుకోవడం జరిగింది.. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ కౌన్సిలర్ ధర్మపురి శ్రీనివాస్ సీనియర్ నాయకులు ఆకుల సతీష్ జంగిటి అంజయ్య గురువయ్య గౌడ్ ఎండి మాజీద్ సౌద మహేష్ యాట క్రాంతి కుమార్ రఘు ఠాగూర్ ఎండి ఆజమ్, మదురి రాజు తదితరులు పాల్గొన్నారు.

తొలిఅడుగు తెలుగు దిన పత్రిక

# దేశవ్యాప్త సార్వత్రిక సమ్మె మే 20న జయప్రదం చేయాలి

తొలిఅడుగు, బూర్గంపాడు, మే 08 : తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు బత్తుల వెంకటేశ్వర్లు వారితో మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వం ప్రజల పైన భారాలు మోపుతూ ప్రజలకున్న హక్కులని ప్రైవేటు వ్యక్తులకి అప్ప జెప్పడం, ప్రభుత్వం ఆస్తులని కొందరికి అప్పనంగా ఇవ్వటం, సామాన్య ప్రజల పైన నిత్యవసర సరుకులు కొనలేని పరిస్థితి, ఉపాధి కార్మికులకు కొలతలు లేకుండా డబ్బులు ఇవ్వాలని 600 రూపాయలు రోజు కూలి ఇవ్వాలని రెండు వందల రోజులు పని దినాలు కల్పించాలని జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పని చట్టాన్ని కాపాడుకోవాల్సిన అవసరం ఉపాధి కార్మికుల పైన ఉందని, కేంద్ర ప్రభుత్వం ఉపాధి చట్టాన్ని దుర్వినియోగం చేయాలని, నిధులు బడ్జెట్లో కేటాయించలేదని పని భారాన్ని పెంచటం మూడు ఫోటోలు పేరుతో ఉపాధి కార్మికుల్ని ఇబ్బంది పెట్టడం, అనేక విషయాలు పైన సార్వత్రిక సమ్మె మే 20న జరిగే సమ్మెకు ఉపాధి కార్మికులు కూడా పాల్గొని జయప్రదం చేయాలని నినాదాలు ఇస్తూ ఉపాధి హక్కుని కార్మిక చట్టాలనే కాపాడుకుందామని నాలుగు లేబర్ కోడ్స్ రద్దు చేయాలని కార్మిక చట్టాలని రక్షించుకోవాలని పిలుపునిచ్చారు, ఈ కార్యక్రమంలో కుర్స సత్యనారాయణ, కనితి శంకర్, భీమయ్య, జోగారావు, ఇర్ప సీతమ్మ ,మహేశ్వరి, మేకల నారాయణ, కుర్సు గణేష్, కనితి కృష్ణమూర్తి, కారం అర్జున్ రావు, కారం సీతమ్మ, మిరియాల చిట్టిమ్మ, తదితరులు పాల్గొన్నారు.





# హుజురాబాద్ మండలం యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో పొన్నం ప్రభాకర్ జన్మదిన వేడుకలు



తొలిఅడుగు, హుజురాబాద్, మే 08 : హుజురాబాద్ మండలం యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో పొన్నం ప్రభాకర్ జన్మదిన వేడుకలు తెలంగాణ ఉద్యమకారుడు ప్రస్తుత రవాణా మరియు బీసీ సంక్షేమ శాఖ మంత్రివర్యులు పొన్నం ప్రభాకర్ 58 జన్మదినం సందర్భంగా హుజురాబాద్ మండలం యూత్ కాంగ్రెస్ నాయకుల ఆధ్వర్యంలో ప్రభుత్వ కళాశాల మైదానంలో మొక్కలు నాటి పొన్నం ప్రభాకర్ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించడం జరిగింది.

ఈ కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ హుజురాబాద్ మండల అధ్యక్షులు పంజాల అరవింద్ గౌడ్, ఉపాధ్యక్షులు మేకల రాజు కుమార్, చల్లూరి విష్ణువర్ధన్, మరియు ప్రధాన కార్యదర్శి పంజాల రాజు గౌడ్ మరియు యూత్ కాంగ్రెస్ నాయకులు పిట్ట సాయి, బాలు, బన్నీ తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్ర బీసీ, రవాణా శాఖ మంత్రివర్యులు పొన్నం ప్రభాకర్ ను కలిసిన జమ్మికుంట వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ పుల్లూరి స్వప్న సదానందం

తొలిఅడుగు, హుజురాబాద్, మే 08 : రాష్ట్ర బీసీ మరియు రవాణా శాఖ మంత్రివర్యులు పొన్నం ప్రభాకర్ పుట్టినరోజు సందర్భంగా జమ్మికుంట వ్యవసాయ మార్కెట్ కమిటి చైర్ పర్సన్ పుల్లూరి స్వప్న సదానందం గురువారం రోజున కొత్తకొండ శ్రీ వీరభద్ర స్వామి దేవాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి పూల మొక్క అందజేసి శాలువాతో సత్కరించి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేయడం జరిగింది ఈ సందర్భంగా జమ్మికుంట వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ పుల్లూరి స్వప్న సదానందం మాట్లాడుతూ రాష్ట్ర బీసీ మరియు రవాణా శాఖ మంత్రివర్యులు పొన్నం ప్రభాకర్ రానున్న రోజుల్లో మరెన్నో ఉన్నతమైన పదవులు అధిరోహించాలని కోరారు ఈ కార్యక్రమంలో జమ్మికుంట వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ ఎగ్గెటి సదానందం కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు అంబాల రాజు తదితరులు పాల్గొన్నారు.




# మంత్రి పొన్నం ప్రభాకర్ జన్మదినం సందర్బంగా రక్తదాన చేసిన యువజన కాంగ్రెస్ నాయకులు

తొలిఅడుగు, హుజురాబాద్, మే 08 : హుజురాబాద్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ఒడితల ప్రణవ్ నాయకత్వంలో నియోజకవర్గ మొత్తం ఘనంగా మంత్రి పొన్నం ప్రభాకర్ జన్మదిన వేడుకల్లో భాగంగా యువజన కాంగ్రెస్ అసెంబ్లీ ప్రెసిడెంట్ ఆధ్వర్యంలో హుజురాబాద్ పట్టణం సివిల్ హాస్పిటల్ లో రాష్ట్ర మంత్రివర్యులు పొన్నం ప్రభాకర్ 58 వ జన్మదిన సందర్భంగా 58 మందితో పాటు యూత్ కాంగ్రెస్ అసెంబ్లీ ప్రెసిడెంట్ చల్లూరి రాహుల్ రక్తదానం చేయడం జరిగింది అనంతరం యువజన కాంగ్రెస్ అసెంబ్లీ ప్రెసిడెంట్ చల్లూరి రాహుల్ మాట్లాడుతూ రాష్ట్ర మంత్రివర్యులు పొన్నం ప్రభాకర్ విద్యార్థి ఉద్యమాల నుండి కాంగ్రెస్ పార్టీకి అనేక సేవలందించిన ఘన చరిత్ర కలిగిన వారు తెలంగాణ ఉద్యమంలో అనేకమంది ప్రాణాలర్పిస్తుంటే చూడలేక పార్లమెంట్లో తెలంగాణ కోసం కొట్లాడి బిల్లు ప్రవేశపెట్టించిన ఘనత ప్రభాకర్ కె దక్కుతుంది కాంగ్రెస్ పార్టీలో ఎన్నో ఆటుపోట్లు తిన్న ఏ ఒక్క రోజు పార్టీని విడిచిపెట్టకుండా పార్టీకి వెన్ను తట్టి నిలుస్తూ కార్యకర్తలకు అండగా ఉన్నారు కాంగ్రెస్ ప్రభుత్వం మళ్లీ అధికారంలోకి రావడంలో పొన్నం ప్రభాకర్ కీలక పాత్ర పోషించారు బీసీ కులగణలో దేశానికి ఆదర్శంగా కులగన్న చేయడంలో ప్రభాకర్ శ్రమ ఎంతో ఉంది మాలాంటి యువజన కాంగ్రెస్ వారికి ఒక ఆదర్శప్రాయకుడిగా ఉన్నాడని రాష్ట్ర మంత్రివర్యులు పొన్నం ప్రభాకర్ గారి జన్మదినం ఘనంగా నిర్వహించడం జరిగింది ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు కొలువురి కిరణ్, సీనియర్ నాయకులు సొల్లు బాబు, మహిళా బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షురాలు సుశీల, మహిళా పట్టణ అధ్యక్షురాలు పుష్పలత, మహిళా మండల అధ్యక్షురాలు పుల్ల రాధ, యూత్ కాంగ్రెస్ అసెంబ్లీ వైస్ ప్రెసిడెంట్ గోస్కుల నాగమణి, యూత్ కాంగ్రెస్ అసెంబ్లీ సెక్రటరీ తరుణ్, మండలం వైస్ ప్రెసిడెంట్ సంపంగి అరుణ్ కుమార్,సోషల్ మీడియా ఇంచార్జ్ మిడిదొడ్డు రాజు, మహిళా కమిటీ కరీమా తదితరులు పాల్గొన్నారు .





# పసిడి ప్రియులకు షాక్..



తొలిఅడుగు, బులియన్ మార్కెట్‌లో బంగారం ధరలు పరుగులు పెడుతున్నాయి.. ఇటీవల గతంలో ఎన్నడూ లేని విధంగా ఆల్‌టైమ్ హైకి ఎగబాకి.. లక్ష మార్కు దాటిన విషయం తెలిసిందే.. ఆ తర్వాత పసిడి ధరలు క్రమంగా తగ్గుతూ వచ్చినట్లే వచ్చి.. మళ్లీ ఎగబాకుతున్నాయి. బులియన్ మార్కెట్‌లో బంగారం ధరలు పరుగులు పెడుతున్నాయి.. ఇటీవల గతంలో ఎన్నడూ లేని విధంగా ఆల్‌టైమ్ హైకి ఎగబాకి.. లక్ష మార్కు దాటిన విషయం తెలిసిందే.. ఆ తర్వాత పసిడి ధరలు క్రమంగా తగ్గుతూ వచ్చినట్లే వచ్చి.. మళ్లీ ఎగబాకుతున్నాయి.. వాస్తవానికి అంతర్జాతీయంగా జరుగుతున్న పరిణామాల ప్రకారం.. బంగారం, వెండి ధరల్లో ఎప్పటికప్పుడు మార్పులు, చేర్పులు జరుగుతుంటాయి. ఒక్కోసారి ధరలు తగ్గితే.. మరికొన్నిసార్లు పెరుగుతుంటాయి. ప్రస్తుతం బులియన్ మార్కెట్‌లో స్వచ్ఛమైన పసిడి ధర 99వేలకు పైగా ఉంది. మే 08 2025 గురువారం ఉదయం ఆరు గంటల వరకు పలు వెబ్‌సైట్లలో నమోదైన ధరల ప్రకారం.. ధరలు స్వల్పంగా పెరిగాయి.. దేశీయంగా 22 క్యారెట్ల బంగారం 10 గ్రాముల ధర రూ.90,760 గా ఉండగా.. 24 క్యారెట్ల పది గ్రాముల గోల్డ్ ధర రూ.99,010 గా ఉంది. వెండి కిలో ధర రూ.99,100లుగా ఉంది. పదిగ్రాముల బంగారంపై రూ.100, కిలో వెండిపై రూ.100 మేర ధర పెరిగింది. కాగా.. ప్రాంతాల వారీగా బంగారం, వెండి ధరల్లో వ్యత్యాసం ఉంటుంది. హైదరాబాద్‌లో 22 క్యారెట్ల బంగారం ధర రూ.90,760, 24 క్యారెట్ల ధర రూ.99,010 గా ఉంది. విశాఖపట్నం, విజయవాడ నగరాల్లో 22 క్యారెట్ల బంగారం ధర రూ.90,760, 24 క్యారెట్ల ధర రూ.99,010 గా ఉంది. ఢిల్లీలో 10 గ్రాముల 22 క్యారెట్ల పసిడి ధర రూ.90,910, 24 క్యారెట్ల ధర రూ.99,160 గా ఉంది. ముంబైలో 22 క్యారెట్ల ధర రూ.90,760, 24 క్యారెట్ల ధర రూ.98,010 గా ఉంది. చెన్నైలో 22 క్యారెట్ల ధర రూ.90,760, 24 క్యారెట్ల రేటు రూ.99,010 గా ఉంది. బెంగళూరులో 22 క్యారెట్ల ధర రూ.90,760, 24 క్యారెట్ల ధర రూ.99,010 గా ఉంది.

## జమ్మికుంట వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ పుల్లూరి స్వప్న సదానందం ఆధ్వర్యంలో మంత్రి పొన్నం ప్రభాకర్ జన్మదిన వేడుకలు



తొలిఅడుగు, హుజురాబాద్, మే 08 : రాష్ట్ర బీసీ మరియు రవాణా శాఖ మంత్రివర్యులు పొన్నం ప్రభాకర్ జన్మదిన వేడుకలు జమ్మికుంట పట్టణంలోని స్థానిక వ్యవసాయ మార్కెట్ లో జమ్మికుంట వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ పుల్లూరి స్వప్న సదానందం ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి పెద్ద ఎత్తున పండ్లు పంపిణీ కార్యక్రమం చేశారు ఈ సందర్భంగా జమ్మికుంట వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ పుల్లూరి స్వప్న సదానందం మాట్లాడుతూ రాష్ట్ర బీసీ మరియు రవాణా శాఖ మంత్రివర్యులు పొన్నం ప్రభాకర్ ఎన్ ఎస్ యు ఐ విద్యార్థి సంఘం నుండి రాజకీయ ప్రస్థానాన్ని ప్రారంభించి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో ఎన్.ఎస్.యూఐ రాష్ట్ర అధ్యక్షునిగా, మార్కెట్ చైర్మన్ గా కరీంనగర్ పార్లమెంట్ సభ్యునిగా గెలుపొందిన తర్వాత ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం కోసం పార్లమెంట్ లో పెప్పర్ స్ప్రే దాడి జరిగినప్పటికీ కూడా వెనకడుగు వేయకుండా ప్రత్యేక తెలంగాణ రాష్ట్రాన్ని సాధించడంలో కీలక పాత్ర పోషించి రాష్ట్ర బీసీ మరియు రవాణా శాఖ మంత్రిగా సేవలందిస్తున్నారు ఈ కార్యక్రమంలో జమ్మికుంట వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్స్ కందాల తిరుపతి దొడ్డి శ్యాం కుమార్ ఎగ్గెటి సదానందం జమ్మికుంట ఆర్థిదారుల మరియు దాడువాయిల సంఘం అధ్యక్షులు ఎర్రబెల్లి రాజేశ్వర్ రావు కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు అంబాల రాజు ఆర్తి ట్రేడర్స్ దాడువాయిలు హమాలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## మంత్రి పొన్నం ప్రభాకర్ కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన పీసీసీ సభ్యులు పత్తి కృష్ణా రెడ్డి దేవస్థాన చైర్మన్ ఇంగిలే రామారావు



తొలిఅడుగు, హుజురాబాద్, మే 08 : విద్యార్థి నాయకుడిగా, తెలంగాణ కోసం పార్లమెంట్ లో కొట్లాడిన వీరుడిగా, అసెంబ్లీలో కులగణన బిల్లు పెట్టి బిసిల గొంతుకగా, ప్రజల మనసు గెలుచుకున్న బహుజన ముద్దు బిడ్డ తెలంగాణ రాష్ట్ర ప్రజల శ్రేయస్సు కై పరితపిస్తున్న మా అభిమాన నాయకులు మంత్రి పొన్నం ప్రభాకర్ కు హార్దిక జన్మదిన శుభాకాంక్షలు మంత్రి పొన్నం ప్రభాకర్ ను శాలువాతో సన్మానం చేసి గజమాలతో సత్కరించడం జరిగింది. శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానం లడ్డు ఇవ్వడం జరిగింది అధికారం లేనప్పుడు ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో కాంగ్రెస్ పార్టీ ని కాపాడటానికి విస్తృత పర్యటనలు, మండల స్థాయి వరకు కార్యక్రమాలు చేసిన నాయకులు పొన్నం ప్రభాకర్ . అవకాశాలను సమర్థవంతంగా పూర్తి చేయగలిగాం, నిరూపించుకున్నాం. మీ సేవా మార్గం ఎంతో మందికి దిక్సూచి.. రాష్ట్ర సంక్షేమాభివృద్ధి లో సీఎం రేవంత్ రెడ్డి కి అండగా ఉండే మా అభిమాన నాయకులు పొన్నం ప్రభాకర్ ఆయురారోగ్యాలతో, సుఖ సంతోషాలతో.. చిరకాలం ప్రజాసేవలో కొనసాగాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను. ఈ కార్యక్రమంలో ధర్మకర్తలు పరమేష్, కిరణ్, కిషన్ రెడ్డి, శ్రీనివాస్, తిరుపతి రెడ్డి, నారాయణరెడ్డి, చిరంజీవి మార్కెట్ కమిటీ డైరెక్టర్లు దీక్షిత్ సురేష్ హుజురాబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్ స్వామి రెడ్డి మాజీ మండలాధ్యక్షుడు మహేందర్ హుజురాబాద్ టౌన్ అధ్యక్షులు తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

## చట్టాన్ని ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు హుజురాబాద్ టౌన్ సీఐ గా టి కరుణాకర్




తొలిఅడుగు, హుజురాబాద్, మే 08 : శాంతి భద్రతల పరిరక్షణకు కృషి చేస్తానని నూతనంగా వీధిలో చేరిన హుజురాబాద్ టౌన్ సిఐ టి కర్ణాకర్(%ఎబఓబతీఖఎఖఎ ఎశీఏఅ జ× ఖుతీఅఖఎుతీ%) అన్నారు. కరీంనగర్ జిల్లా హుజురాబాద్ పట్టణంలో పోలీస్ స్టేషన్లో సీఐగా గురువారం బాధ్యతలు తీసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఫిర్యాదుదారులు నేరుగా తనకే ఫిర్యాదు చేయాలని తెలిపారు. చట్టాన్ని ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పోలీస్ సిబ్బంది సీఐ కరుణాకర్ కి శుభాకాంక్షలు తెలిపారు.

## జమ్మికుంట కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సుంకరి రమేష్ ఆధ్వర్యంలో ఘనంగా మంత్రి పొన్నం ప్రభాకర్ జన్మదిన వేడుకలు



తొలిఅడుగు, హుజురాబాద్, మే 08 : ఈరోజు ఉదయం జమ్మికుంట పట్టణంలోని గాంధీ చౌరస్తాలో కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సుంకరి రమేష్ ఆధ్వర్యంలో రాష్ట్ర రవాణా శాఖ మరియు బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ 58వ జన్మదిన కార్యక్రమాన్ని పురస్కరించుకొని కేక్ కటింగ్ చేయడం జరిగింది మరి వారు విద్యార్థి నాయకునిగా మొదలై తెలంగాణ ఉద్యమ నేతగా అంచలంచెలుగా ఎదిగి నేడు తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వంలో చురుకైన మంత్రిగా వ్యవహరిస్తున్న మంత్రిగారు ఆయురారోగ్యాలతో ఉండాలని కోరుకుంటున్నాం ఈ కార్యక్రమంలో టిపిసిసి ప్రచార కమిటీ ఎగ్జిక్యూటివ్ నెంబర్ సాయిని రవి సేవాదళ్ నియోజవర్గ అధ్యక్షుడు వినోద్ రెడ్డి బ్లాక్ కాంగ్రెస్ నాయకులు మొలుగురు సదన్న మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు పూదరి రేణుక శివకుమార్ గౌడ్ సీనియర్ కాంగ్రెస్ నాయకులు ముద్దు మల్ల రవి యూత్ కాంగ్రెస్ అసెంబ్లీ జనరల్ సెక్రటరీ పంజాల అజయ్ గౌడ్ యూత్ కాంగ్రెస్ నాయకులు ఎండి సజ్జు వాసాల రామస్వామి యాట్ల అశోక్ దొడ్డ శ్రీకాంత్ గుర్రపు ప్రవీణ్ మండ అశోక్ పోతుల శీను గడ్డం రమేష్ చంచల శ్రీనివాస్ దొడ్డే నవీన్ రాజ్ కుమార్ పాతకాల రమేష్ కమలాకర్ సుధాకర్ కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు పాల్గొనడం జరిగింది.

## వాలీబాల్ టోర్నమెంట్ ప్రారంభించిన ఇల్లందు డిఎస్పి ఎన్ చంద్రబాను





తొలిఅడుగు, గుండాల, మే 08 :- గుండాల మండల వాలీబాల్ టోర్నమెంట్ ను ఈరోజు ఇల్లందు డిఎస్పి ఎన్ చంద్రబాను ప్రారంభించారు. డీఎస్పీ మాట్లాడుతూ క్రీడలు ఫిజికల్ ఫిట్నెస్ తో పాటు మెంటల్ గా కూడా ఫిట్ గా ఉండేటట్లు చేస్తాయని క్రీడలు మన దైనందిక చర్యల్లో భాగంగా చేసుకోవాలని, ఏజెన్సీ ప్రాంతంలో యువత ఎక్కువగా వాలీబాల్ క్రీడలు ఆడుతారు కాబట్టి జిల్లా ఎస్పీ రోహిత్ రాజ్ ఐపీఎస్ గారి ఆదేశాల మేరకు వాలీబాల్ టోర్నమెంట్ ని గుండాల ఆళ్లపల్లి కోమరారం పీఎస్ పరిధిలోని యువత కొరకు గుండాల పోలీసు వారు ఈ టోర్నమెంటును ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపినారు. యువత చెడు అలవాట్లకు లోను కాకుండా క్రీడలపై దృష్టి పెట్టాలని తెలిపారు. ఈరోజు వాలీబాల్ టోర్నమెంట్లో మొత్తం 30 జట్లు పాల్గొన్నాయి అని తెలిపినారు. గుండాల సీఐ రవీందర్ మాట్లాడుతూ క్రీడల వల్ల ఎన్నో ఉపయోగాలు ఉన్నాయని ఆరోగ్యంగా ఉంటారని చెడు అలవాట్లుకు కూడా దూరంగా ఉంటారని తెలిపారు. ఇట్టి కార్యక్రమంలో గుండాల ఎస్ఐ సైదా రవూఫ్ కొమరారం ఎస్సై పటాన్ నాగుల్ మీరా ఖాన్ మండల వ్యాపారస్తులు ప్రజలు యువత పాల్గొన్నారు.

## కోల్ ఇండియాకు రూ.9,593 కోట్ల లాభాలు




తొలిఅడుగు, :దేశంలోనే అతిపెద్ద బొగ్గు ఉత్పత్తిదారు కోల్ ఇండియా 2024-25 మార్చితో ముగిసిన నాలుగో త్రైమాసికం (క్యూ4)లో 12 శాతం వృద్ధితో రూ. 9,593 కోట్ల నికర లాభాలు సాధించింది. ఇంతక్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో రూ. 8,530 కోట్ల లాభాలు నమోదు చేసింది. ఆర్థిక సంవత్సరం 2024-25కు గాను తుది డివిడెండ్ కింద ప్రతీ ఈక్విటీ షేర్‌పై రూ. 5.15 చెల్లించడానికి కోల్ ఇండియా బోర్డు నిర్ణయించింది. ఎజిఎం తర్వాత ఈ మొత్తాన్ని 30 రోజుల్లో చెల్లించనుంది. గడిచిన క్యూ4లో కంపెనీ మొత్తం వ్యయాలు రూ29,057 కోట్లకు పెరిగాయి. ఇంతక్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో రూ. 28,950 కోట్లుగా నమోదయ్యాయి. 2024-25లో మొత్తంగా 781.05 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి చేసింది. ఇంతక్రితం 2023-24లో 773.65 మిలియన్ టన్నుల ఉత్పత్తి జరిగింది. బుధవారం ఎన్ఎస్ఇలో కోల్ ఇండియా షేర్ 1.6 శాతం పెరిగి రూ. 384 వద్ద ముగిసింది.